ఈనాడు
అమరావతి
కృష్ణా
మంగళవారం అక్టోబరు 1, 2024

ఎంబీబీఎస్ యాజమాన్య సీట్ల రెండో విడత కౌన్సెలింగ్

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీబీఎస్ యాజమాన్య కోటా సీట్ల భర్తీకి రెండో విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటన విడుదల చేసింది. సోమవారం రాత్రి 10 గంటల నుంచి రెండో తేదీ రాత్రి 9 గంటల వరకు ఆప్షన్లు ఇచ్చుకోవాలి. రాష్ట్రంలోని 6 ప్రభుత్వ కళాశాలల్లోని సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లలో 'బి' కేటగిరీలో 32, ఎన్నారై కోటా కింద 15 సీట్లు, 17 ప్రైవేటు వైద్య కళాశాలల్లో బి1 కేటగిరీలో 77, బి2 కేటగిరీలో 117, సి కేటగిరీలో 110 సీట్లు ఉన్నాయి. మైనారిటీ వైద్య కళాశాలల్లో బి కేటగిరీలో 30, సి కేటగిరీలో 29 సీట్లను రెండో విడత కౌన్సెలింగ్‌కు అందుబాటులో ఉంచారు.

శరన్నవరాత్రి మహోత్సవాలకు ఆహ్వానం



ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల సన్నిధిలో నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు.. మంత్రి లోకేశ్‌లను దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆహ్వానించారు. ఈవో రామారావు, వేదపండితులు పాల్గొన్నారు. **- ఈనాడు, అమరావతి**

ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలో సెక్షన్ 30 అమలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలో సెక్షన్ 30, పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నిషేధాజ్ఞలు విధిస్తున్నట్లు పోలీస్ కమిషనర్, మెట్రోపాలిటన్ ప్రాంత అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు. అక్టోబరు 1 నుంచి డిసెంబరు 31వ తేదీ వరకు మొత్తం 92 రోజుల పాటు ఈ సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. పోలీసు శాఖ నుంచి ముందస్తు అనుమతులు తీసుకోకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు, నిరసనలు, ధర్నాలు నిర్వహించకూడదు. నిషేధాజ్ఞలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

ఈ-వ్యర్థం.. ఇచ్చేద్దాం



సేకరించి గుట్టగా వేసిన కంప్యూటర్ వ్యర్థాలు

రాష్ట్రంలోనే ప్రథమంగా సేకరణకు ఏర్పాట్లు
తొలి విడతగా 11 టన్నులకుపైగా రీసైక్లింగ్

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

స్వచ్ఛతాహీ సేవలో భాగంగా ప్రతి ప్రాంతం పరిశుభ్రంగా ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దీనిలో భాగంగానే జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ప్రతి ఇంటిలోనూ ఎలక్ట్రానిక్ వ్యర్థాలు విపరీతంగా పోగుబడుతున్నాయి. వీటిలోని హానికర రసాయన విడిభాగాల నుంచి ప్రమాదం పొంచి ఉంది. దీనిని గుర్తించిన ప్రభుత్వం వాటిని సేకరించి రిసైక్లింగ్ చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలోనే ప్రథమంగా ఈ-వ్యర్థాల సేకరణకు జిల్లాలో శ్రీకారం చుట్టారు.

జిల్లాలో 25 మండలాల్లో సేకరించిన ఈ-వ్యర్థాలు
9,646 కేజీలు

పట్టణం	సేకరణ (కేజీల్లో)
మచిలీపట్నం	449
పెడన	360
గుడివాడ	410
తాడిగడప	843
ఉయ్యూరు	100
మొత్తం	2,162



పంచాయతీల్లో ఏర్పాటు చేయనున్న కేంద్రాలు

పది చోట్ల కేంద్రాల ఏర్పాటు

తొలుత జిల్లా వ్యాప్తంగా సేకరించిన వాటిని మచిలీపట్నం తరలించారు. వీటిలో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, కుక్కర్లు, మిక్సీలు, టీవీలు, వాషింగ్ మిషన్‌లు, రిఫ్రిజిరేటర్లు, ఫ్యాన్లు ఉన్నాయి. ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో రెండో విడతగా జిల్లాలోని పది మేజర్ పంచాయతీల్లో ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బందరు మండలం పోతేపల్లి, అవనిగడ్డ, బాపులపాడు, చల్లపల్లి, గుడివాడ మండలం మల్లాయిపాలెం, గుడ్లవల్లేరు, నాగాయలంక, పామర్రు, ఉంగుటూరు, పెదపారుపూడి పంచాయతీల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

ప్రమాదాన్ని అరికట్టేలా?



పాడైపోయిన టీవీలు

ప్రస్తుతం ప్రతి ఇంట్లోనూ టీవీలు, చరవాణులు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, కుక్కర్లు, మిక్సీలు ఇలా అనేక ఎలక్ట్రానిక్ వస్తువులు ఉంటున్నాయి. పాడైన, కాలం చెల్లిన ఆ పరికరాలను చాలా మంది ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. తడి, పొడి చెత్త విడివిడిగా సేకరిస్తున్నా వాటిలో ప్రమాదకర రసాయనాలతో మిళితమైన ఈ-వ్యర్థాలు కలిసిపోతున్నాయి. ఇది పర్యావరణానికి ఎంతో హాని చేస్తుంది. ఈ నేపథ్యంలో కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ ప్రత్యేక చొరవ తీసుకుని ఈ-వ్యర్థాల సేకరణపై విధి విధానాలు రూపొందించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో దుకాణాలు, ఇళ్లకు వెళ్లి ఎలక్ట్రానిక్ వ్యర్థాలు సేకరించేలా చర్యలు తీసుకున్నారు.

ప్రజల నుంచి విశేష స్పందన

జిల్లా వ్యాప్తంగా సేకరించిన ఈ-వ్యర్థాలను వాహనాల ద్వారా బందరు మండలంలోని పోతేపల్లికి తరలించి అక్కడ నిల్వ చేశారు. తొలుత ఒక టన్ను సేకరించగలమని అధికారులు భావించగా 11 టన్నులకుపైగా రావడం విశేషం. ప్రజల నుంచి విశేష స్పందన లభించినట్లు అధికారులు చెబుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో తాడిగడప పురపాలక సంఘ పరిధిలో అత్యధికంగా 843 కేజీలు, ఉయ్యూరులో అత్యల్పంగా 100 కేజీలు సేకరించారు. జిల్లా వ్యాప్తంగా 25 మండలాల్లోని 497 గ్రామ పంచాయతీల పరిధిలోనూ ఈ ప్రక్రియ చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల పరంగా చూస్తే మొవ్వ మండలంలో అత్యధికంగా 781 కేజీలు సమీకరించగా నందివాడ మండలంలో అత్యల్పంగా 60 కేజీలు మాత్రమే సేకరించారు. వీటిని రీసైక్లింగ్ చేసేందుకు ఓ సంస్థకు బాధ్యతలు అప్పగించారు.

స్వచ్ఛందంగా ముందుకు రావాలి



– బాలాజీ, జిల్లా కలెక్టర్

ప్రజలే స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఈ-వ్యర్థాలను కేంద్రాల్లో ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆ దిశగా వారిని చైతన్యం చేయాల్సిందిగా అధికారులను ఆదేశించాం. స్వచ్ఛత అనేది ప్రతి ఒక్కరి బాధ్యతగా ప్రజలు భావించాలి. వీటి సేకరణకు తొలుత పది మేజర్ పంచాయతీల్లో కియోస్క్‌లు ఏర్పాటు చేస్తున్నాం. తరువాత అన్ని చోట్లా వీటిని ఏర్పాటు చేసేదిశగా కృషి చేస్తున్నాం.

ఉత్సవ శోభ

ఘాట్ రోడ్డు ముఖద్వారం వద్ద ఏర్పాట్లు



న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి

దసరా ఉత్సవాలు దగ్గర పడుతున్న తరుణంలో అధికారులు ఏర్పాట్లు శరవేగంగా చేస్తున్నారు. దుర్గాఘాట్ సమీపంలో గతేడాది కొండరాళ్లు జారిపడ్డాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని రోడ్డును సగం వరకు మూసివేస్తూ గడ్డర్లను ఏర్పాటు చేశారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో దేవస్థానం అధికారులు జాతీయ రహదారిపై మధ్య క్యూలైనుకు ఏర్పాటు చేశారు. అపరిశుభ్రంగా ఉన్న ఈ ప్రాంతాన్ని శుభ్రం చేసి ఈసారి గడ్డర్లు ట్రాఫిక్‌కు ఆటంకం లేకుండా ఏర్పాటు చేస్తున్నారు. కుమ్మరిపాలెం సెంటరు వైపు నుంచి వచ్చే భక్తులకు ప్రత్యేకంగా క్యూలైను ఏర్పాటు చేశారు.

తుది దశకు చేరాయి

ఉత్సవాలు ప్రారంభం కావడానికి కొద్దిరోజులే సమయం ఉండటంతో ఘాట్ రోడ్డు రక్షణ గోడ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఆ రహదారిలో క్యూలైన్లు ఇప్పటికే మొదటి మలుపు వరకు పూర్తి చేశారు. కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి నుంచి దుర్గగుడి టోల్‌గేటు క్యూలైను నిర్మాణం పూర్తయ్యింది. రక్షణ గోడ పూర్తైన వెంటనే టోల్‌గేటు నుంచి గోడ వరకు పది గంటల్లో లైన్ల ఏర్పాటు పూర్తి చేస్తామని దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

అదనంగా సిద్ధం..

ఉత్సవాల నేపథ్యంలో దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులు సుమారు ఏడు లక్షలు ఉంటారని దేవస్థానం అధికారులు అంచనా వేశారు. వారిని దృష్టిలో పెట్టుకొని 15 లక్షల లడ్డూ ప్రసాదాన్ని సిద్ధం చేయనున్నారు. అందుకు అవసరమైన పొయ్యిలు ప్రసాదాల పోటులో యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేస్తున్నారు. నిత్యం ప్రసాదాల తయారీకి వినియోగించే వాటికి అదనంగా 30 పొయ్యిలు సిద్ధం చేస్తున్నారు. వీటిని తరలించేందుకు ప్రసాదాల పోటు రెండో ఎగ్జిట్‌కు అడ్డుగా ఉన్న నేతి డబ్బాలను తొలగించారు. ప్రసాదాలు ఆలయ ప్రాంగణానికి తరలించే వాహనాలు, సిబ్బంది కోసం కొంత ఖాళీ స్థలాన్ని కూడా వదిలారు.

మల్లేశ్వర ఆలయం సమీపంలో ఐరన్ మెట్లు

ఘాట్‌రోడ్డు మార్గంలో దర్శనం చేసుకున్న భక్తులు మల్లేశ్వరాలయ మెట్లు, మల్లికార్జున మహా మండపం ర్యాంపు ద్వారా బయటకు వస్తారు. గతంలో అత్యవసర సమయంలో మాత్రమే ఈ మార్గాన్ని వినియోగించే వారు. అధిక శాతం భక్తులు మల్లేశ్వరాలయ మెట్ల మార్గం నుంచి కనకదుర్గానగర్ ప్రసాదాల కౌంటర్లకు చేరే వారు. ఈసారి కనకదుర్గానగర్‌లో ఎలివేటెడ్ క్యూలైన్లు, ప్రసాదాల పోటు, అన్నదాన భవన నిర్మాణ పనులు జరుగుతుండటంతో ప్రత్యామ్నాయంగా మల్లేశ్వరాలయం సమీపంలో ఐరన్ మెట్లు ఏర్పాటు చేశారు. దీంతో పాటు కొత్త ర్యాంపు, స్థానిక భక్తులు పాత మెట్ల మార్గం ద్వారా నేరుగా బ్రాహ్మణ వీధిలోకి చేరేందుకు వీలుంటుంది. గతంలో ఒక ఎంట్రీ, ఒక ఎగ్జిట్ మాత్రమే ఉండేది. ప్రస్తుతం అభివృద్ధి పనులు జరుగుతుండటంతో అదనంగా మూడు ఎగ్జిట్లు ఏర్పాటు చేస్తున్నారు.



సిద్ధంగా ప్రసాదం కౌంటర్లు

మల్లవల్లిలో మొదలెట్టారు!

- విలువైన సున్నపురాయి దోపిడీ
- రూ.కోట్లలో పన్నుల ఎగవేత...

"రాష్ట్రంలో ప్రభుత్వం మారినా.. అక్రమార్కుల తీరు.. అధికారుల వైఖరి మారలేదు. స్వయంగా గనులు, భూగర్భ గనుల శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోనే అక్రమ తవ్వకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. వైకాపా ప్రభుత్వంలో అధికారులు చూస్తుండగానే గ్రావెల్ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగాయి. కొందరు అధికారులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. పోలీసులు సైతం ఆ ఫిర్యాదులను బుట్టదాఖలు చేశారు. ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయలేదు."

ఈనాడు – అమరావతి



అక్రమ క్వారీకి నిదర్శనం...

"తాజాగా సున్నపురాయి అక్రమ తవ్వకాలు జరుగుతున్నా.. అధికారులు కళ్లు మూసుకున్నారు. బాపులపాడు మండలం మల్లవల్లి సమీపంలో ప్రభుత్వ భూముల్లో రూ.కోట్ల విలువైన సున్నపురాయి (క్వార్ట్జ్ రాయి) అక్రమంగా తరలిపోతోంది. దీనిపై ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. గత కొంతకాలంగా పదుల ఎకరాల్లో తవ్వకాలు జరిగాయి. రూ.కోట్ల విలువైన ఖనిజ సంపద దోచేశారు. నూజివీడు ప్రాంత వ్యాపారులు కొందరు దీనిని తరలిస్తున్నట్లు తెలిసింది."

బాపులపాడు మండలం మల్లవల్లిలో కొన్ని భూముల్లో సున్నపురాయి నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించారు. ఈవిషయాన్ని గుట్టుగా ఉంచారు. పాత మల్లవల్లి పరిధిలో ప్రభుత్వ భూముల్లో.. సర్వే నంబర్లు 165, 166 పరిధిలో దాదాపు 12 ఎకరాల్లో ఈ సున్నపురాయి ఉంది. వాస్తవానికి దీనికి లీజులు తీసుకుని తవ్వకాలు చేపట్టాలి. కానీ ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు వ్యాపారులు రాత్రికి రాత్రే తవ్వి అక్రమంగా రవాణా చేస్తున్నారు. లారీలు, టిప్పర్లలో... సున్నపురాయి వేసి పైన గ్రావెల్ నింపి రవాణా చేస్తున్నారని తెలిసింది. పోలీసులు గుర్తించినా గ్రావెల్ పంపుతున్నట్లు మభ్యపెడుతున్నారు. ఎంతో కొంత ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. ఈ సున్నపురాయిని నూజివీడు ప్రాంతానికి తరలించి అక్కడ పిండి చేస్తున్నట్లు తెలిసింది. కొంత చెన్నైకు ఎగుమతి చేస్తున్నట్లు సమాచారం.

రెండు నెలలుగా తవ్వడమే...

గతంలో ఎ.కొండూరు మండలంలో అటవీ ప్రాంతంలో ఓ మాజీ మంత్రి బంధువు విచ్చలవిడిగా తవ్వి చెన్నైకు ఎగుమతి చేశారు. గాజు పరిశ్రమల్లో విరివిగా దీనిని వినియోగిస్తారు. గత రెండు నెలలుగా గుట్టుచప్పుడు కాకుండా పొక్లయిన్లు పెట్టి తవ్వుతున్నా.. స్థానిక అధికారులు తమకు సమాచారం లేదని చెబుతున్నారు. గనులు, భూగర్భ గనుల శాఖ మంత్రిగా జిల్లాకు చెందిన కొల్లు రవీంద్ర బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన జిల్లాలోనే రాత్రికి రాత్రే ఈతవ్వకాలు జరుగుతున్నాయంటే... అధికారుల పాత్ర ఏమేరకు ఉందనేది అర్థమవుతోంది.

ఖజానాకు రూ.కోట్లు నష్టం..!

క్వార్ట్జ్ రాయి.. ఒక ఘనపు మీటరుకు సీనరేజీ కింద గనుల శాఖకు రూ.110 చెల్లించాలి. జిల్లా మైనింగ్ ఫండ్ (డీఎంఎఫ్), మెరిట్ ఛార్జీలు, కన్సిడరేషన్ ఛార్జీలు అన్నీ కలిపి రూ.300 వరకు చెల్లించాలి. ఆ ప్రకారం ఒక ఎకరాలో తవ్విన రాయికి రూ.కోట్లలో ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. అక్కడ మొత్తం 12 ఎకరాల్లో తవ్వుతున్నారు. ఈ రాయి మార్కెట్‌లో క్వాలిటీ మేరకు.. టన్ను ధర రూ.2,000-5,000 ఉంది. మల్లవల్లిలో లభించే క్వార్ట్జ్ రాయి క్వాలిటీ మధ్యతరహాలో ఉంది. దాదాపు రూ.3 వేల వరకు టన్ను ధర పలుకుతుంది. ఇప్పటికే కొన్ని వందల టన్నుల రాయి తరలించారని తెలిసింది. ఇంకా తవ్వుతూనే ఉన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో విలువైన గనులు అరుదుగా ఉన్నాయి. కంకర రాయి మినహా ఎలాంటి భూగర్భ నిక్షేపాలు లేవు. ప్రస్తుతం క్వార్ట్జ్ రాయి వెలుగు చూసింది. దీనిపై ఆదాయం రాకుండా అక్రమార్కులు తవ్వేస్తున్నారు. ఈ తవ్వకాలపై తమకు సమాచారం లేదని అధికారులు చెబుతుండటం గమనార్హం.

అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ, అధికారులు

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చే అర్జీలకు సకాలంలో పరిష్కారాలు చూపాలని కలెక్టర్ బాలాజీ అధికారులకు స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని సోమవారం జిల్లా స్థాయి అధికారులతో సమావేశమై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంకా 627 అర్జీలు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని ప్రస్తావించారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చిన వాటిలో మూడు పెండింగులోనే ఉన్నాయని, గడువు దాటిన అర్జీలు 11 ఉన్నాయని, వాటిపై దృష్టి పెట్టాలన్నారు. జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో చంద్రశేఖరరావుతో కలిసి 140 అర్జీలు పరిశీలించారు.

★ వరదల కారణంగా దెబ్బతిన్న వరికి ఎకరాకు రూ.25వేలు, వాణిజ్య పంటలకు రూ.లక్ష చొప్పున నష్టపరిహారం ఇచ్చి బాధితులను ఆదుకోవాలని, డ్వాక్రా మహిళల రుణాలపై కనీసం మూడు నెలల పాటు మారిటోరియం విధించాలని, జేఎల్‌జీ, సీసీఆర్సీ రుణాలు రద్దు చేసేలా చూడాలని రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు రంగారావు, నాగేశ్వరరావు, లక్ష్మణరావు కోరారు.

★ నాగాయలంక తూర్పు బజారులో ఓ రెవెన్యూ ఉద్యోగి ఆక్రమణలతో రహదారిపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని గ్రామస్థులు రవిబాబు, శ్రీనివాసరావు, తదితరులు ఫిర్యాదు చేశారు.

★ గాంధీ జయంతి సందర్భంగా విద్యార్థులు వ్యర్థాలతో రూపొందించిన కళాకృతులను ప్రదర్శించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అక్టోబరు 2న నోబుల్ కళాశాలలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేయాల్సిన కళాకృతుల ప్రదర్శన(ఆర్ట్ ఎగ్జిబిషన్)పై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు.

ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణకు అన్ని పక్షాలు సహకరించాలి

ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ 2025 కార్యక్రమానికి అన్ని రాజకీయ పక్షాలు సహకరించాలని కలెక్టర్ బాలాజీ కోరారు. సంక్షిప్త సవరణ, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై సోమవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు 21న ప్రారంభించిన ఓటర్ల జాబితా ఇంటింటి పరిశీలన కార్యక్రమం 99.11 శాతం పూర్తయిందన్నారు. హేతుబద్ధీకరణలో భాగంగా అవనిగడ్డ నియోజకవర్గంలో 9 పోలింగ్ కేంద్రాల పేరు మార్పు, గన్నవరం, పెడన, పెనమలూరుల్లో ఒక్కోటి చొప్పున, మచిలీపట్నంలో కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. కృష్ణా-గుంటూరు ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఓటరుగా పేరు నమోదుకు నవంబరు 6లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిసెంబరు 30న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తారన్నారు. తెదేపా ప్రతినిధి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ మచిలీపట్నం నియోజకవర్గంలో రూల్ నెం.6 పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్వో చంద్రశేఖరరావు, వివిధ నియోజకవర్గాల ఈఆర్వోలు సమావేశంలో పాల్గొన్నారు.

ఉపాధి పేరుతో వైకాపా నాయకుల దోపిడీ

నిరుపేదల నుంచి రూ.లక్షల్లో వసూళ్లు
వడ్డీలు కట్టలేక బడుగు జీవుల విలవిల

న్యూస్‌టుడే, గుడివాడ గ్రామీణం

గుడివాడ పురపాలక సంఘంలో పొరుగు సేవల కింద పారిశుద్ధ్య కార్మికుల ఉద్యోగాలు ఇప్పిస్తామని వైకాపా నాయకులు నిరుపేదల నుంచి రూ.లక్షల్లో దోచుకున్నారు. ఈ మేరకు నాలుగేళ్ల ఇందట రూ.లక్షల్లో తీసుకున్న అప్పులకు వడ్డీ చెల్లించలేక నేడు వారంతా రోడ్డున పడ్డారు. మరి కొందరైతే వడ్డీకూడా చెల్లించలేని దుస్థితి. అలాంటి వారికి అప్పు ఇచ్చిన వారు కోర్టు నోటీసులు పంపుతున్నారు. పిల్లలను పోషించుకునే స్థోమత కూడా లేక దయనీయ పరిస్థితిలో ఉన్న వారు తమను మోసం చేసిన వైకాపా నాయకులపై గుడివాడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గుడివాడ పురపాలక సంఘం విస్తరణలో భాగంగా పొరుగు సేవల కింద పారిశుద్ధ్య సిబ్బంది నియామకాల కోసం వైకాపా నాయకులు తెర తీశారు. ఇందులో భాగంగా సుమారు 100 మంది కార్మికులు కావాలని పట్టణంలోని నిరు పేదలకు ఆశ చూపారు. కొడాలి నాని ఉండగా మీకు తప్ప ఎవరికి ఉద్యోగాలొస్తాయంటూ నమ్మబలికి రూ.లక్షల్లో కాజేశారు. పట్టణానికి చెందిన వంపుగడ్డ కల్పలత, పత్తి చిన్నారి, బత్తుల పార్వతి, దనాల ప్రదీప్, వడ్డాది పవన్ వద్ద నుంచి రూ.2 లక్షలు చొప్పున, సంకు సాయికిషోర్ వద్ద రూ.లక్ష, రెడ్డి యువ కిషోర్ నుంచి 1.35 లక్షలు, గండికోట శాంతారావు, గండికోట నర్సమ్మ వద్ద 1.8 లక్షలు వంతున, గండికోట మానస్ వద్ద రూ.2.05 లక్షలు వైకాపా దళారులు తీసుకున్నారు. మరో వ్యక్తి నుంచి రూ.12 లక్షలు తీసుకొని రూ.9 లక్షలు తిరిగి ఇచ్చినట్లు తెలిసింది.

సూత్రధారులు వారే..

వైకాపా అధికారంలో ఉండగా గుడివాడ నియోజకవర్గంలో గతంలో షాడో ఎమ్మెల్యేగా పేరు పొందిన నాయకుడి అండదండలతో 15 అక్టోబరు 2020 నుంచి 30 అక్టోబరు 2020 మధ్య తమకు ఉద్యోగాలు ఇప్పిస్తామని వైకాపా నాయకులు గుళ్లపల్లి శ్రీనివాసరావు, అద్దేపల్లి పురుషోత్తం, హరిబాబు 10 మంది నుంచి రూ.18.4 లక్షలు తీసుకొని మోసం చేశారని గండికోట శాంతారావు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారిపై సెక్షన్ 417, 420, రెడ్ విత్ 34 ఐపీసీ కింద కేసులు నమోదు చేశారు. ఈ ఉపాధి మోసాల వెనుక మాజీ మంత్రి కార్యాలయం అండ ఉందని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో అప్పటి పురపాలక కమిషనర్ నిందితుల నుంచి తీసుకున్న నగదు తిరిగి చెల్లించే వరకు అతని బదిలీ ఆపారు. నిందితుల్లో ఒకరు టిడ్కో ఇళ్లు ఇప్పిస్తానని చాలా మంది వద్ద రూ.లక్షల్లో దోచుకున్నట్లు తెలిసింది.

శానిటరీ ఇన్‌స్పెక్టరు, ఎల్ఆర్‌పీ బెదిరింపుల

ఇదిలా ఉండగా మా వద్ద పని చేస్తున్న మీ బంధువులు, అన్నదమ్ముల అంతు చూస్తామంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన పేదలను వైకాపా సానుభూతిపరులైన శానిటరీ ఇన్‌స్పెక్టరు, లైన్ రిసోర్స్ పర్సన్(ఎల్ఆర్‌పీ)లు బెదిరిస్తున్నారు. కేసులు వెనక్కి తీసుకోవాలని హెచ్చరిస్తున్నారని బాధితులు వాపోతున్నారు.

పిల్లాపాపలతో రోడ్డున పడ్డాం



ఉద్యోగం ఆశ చూపడంతో నాలుగేళ్ల కిందట అప్పు చేసి రూ.రెండు లక్షలు ఇచ్చాము. నేడు బాకీలు చెల్లించలేక అందరం రోడ్డున పడాల్సి వస్తోంది. అధికారులు దయతో మా నగదు ఇప్పించాలి.– వంపుగడ్డ కల్పలత

నోటీసులిస్తామని బెదిరిస్తున్నారు



తెచ్చిన అప్పులకు 2020 నుంచి వడ్డీ కడుతున్నాము. కష్టపడిన సొమ్మంతా వడ్డీలకే పోతుంది. వడ్డీ చెల్లించకపోతే కోర్టు నోటీసులు ఇస్తున్నారు. మమ్మల్ని మోసం చేసిన వారు దర్జాగా బతుకుతున్నారు. – పత్తి చిన్నారి

డ్రాగన్ ఫ్రూట్ సాగుకు మొగ్గు

చందర్లపాడు, న్యూస్‌టుడే



చందర్లపాడులో పండ్ల తోట

సంప్రదాయ పంటలు సాగు చేసి నష్టాలు చవిచూసిన కొందరు రైతులు డ్రాగన్ ఫ్రూట్ వైపు దృష్టి సారిస్తున్నారు. చందర్లపాడు, ముప్పాళ్ల, గుడిమెట్ల, చింతలపాడు తదితర ప్రాంతాల అన్నదాతలు మంచి పోషకాలతో కూడిన, మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న.. డ్రాగన్ ఫ్రూట్ పండించేందుకు మొగ్గు చూపుతున్నారు. అందులో ఒకరు చందర్లపాడు గ్రామానికి చెందిన రైతు తమ్మినేని రామయ్య. గతేడాది ఎకరంన్నర పొలంలో సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. పొలంలో బావి ఉన్నప్పటికీ నీటి సమస్య తలెత్తకుండా బోరు వేయించారు. సిమెంటు స్తంభాలు పాతి వాటిపై టైర్లు అమర్చారు. పొలం చుట్టూ కంచె ఏర్పాటు చేయించారు. పల్నాడు జిల్లా వేమవరం నుంచి ఒక్కో మొక్క రూ.60 కొనుగోలు చేసి నాటారు. బిందు సేద్యం ద్వారా నీరందిస్తున్నారు. రూ.10 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. ఎనిమిది నెలలకు దిగుబడి ప్రారంభమైంది. పండ్లను పొలం వద్ద, ఆటోలో గ్రామాలకు తీసుకెళ్లి కిలో రూ. 150-రూ.200కు విక్రయిస్తున్నారు. ఇప్పటివరకు 900 కిలోల పండ్లు కోశారు. మూడేళ్లలో పెట్టిన పెట్టుబడి చేతికి వస్తుందని, తర్వాత కొన్నేళ్ల వరకు నికర ఆదాయం పొందవచ్చని అభిప్రాయపడ్డారు. వాణిజ్య పంటలు వేసి ఆర్థికంగా నష్టపోవడం కన్నా... డ్రాగన్‌ఫ్రూట్ ఒకసారి సాగు చేస్తే 25 సంవత్సరాల వరకు రాబడి పొందవచ్చని వివరించారు.

మార్కెటింగ్ సమస్యతో సతమతం



దిగుబడి బాగానే ఉంది. విక్రయించడానికి మార్కెట్ సమస్య ఉంది. సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లి తక్కువ ధరకు అమ్మడం ఇష్టం లేదు. అందుకే ఆటోలో తీసుకెళ్లి చుట్టుపక్కల గ్రామాల్లో విక్రయిస్తున్నా. ప్రారంభంలో తోట దగ్గరికే వచ్చి కిలో రూ.200 చొప్పున కొనుగోలు చేశారు. దిగుబడి పెరగడంతో కిలో రూ.150కు విక్రయించా. ప్రస్తుతం రూ.180-రూ.200 వరకు ధర పలుకుతోంది. మార్కెట్ సమస్యను అధికారులు పరిష్కరిస్తే బాగుంటుంది.

– తమ్మినేని రామయ్య, రైతు, చందర్లపాడు

రైతేరాజు

ప్రశ్న: పొద చిక్కుడు రకం, విత్తన మోతాదు, విత్తే సమయం, ఎరువుల యాజమాన్యం గురించి వివరించండి?

– కె. శ్రీనివాసరావు, ఘంటసాల

సమాధానం: పొద చిక్కుడు అర్కజయ రకం 50-60 రోజులకు కోతకు వస్తుంది. కాయలు ముదురు ఆకుపచ్చ రంగులో ఉంటాయి. ఎకరానికి 4-8 టన్నులు దిగుబడి వస్తుంది. పొద రకానికి ఎకరానికి 16 కిలోల విత్తనాలు సరిపోతాయి. అక్టోబరులో విత్తుకోవచ్చు. పశువుల ఎరువు ఎకరాకు 8-10 టన్నులు విత్తడానికి వారం ముందు ఆఖరి దుక్కిలో వేసి దున్నాలి. ఎకరానికి 24 కిలోల భాస్వరం, 12 కిలోల పొటాష్‌తో పాటు మొదటిసారి 15 కిలోల నత్రజని వేయాలి. రెండో సారి 15 కిలోల నత్రజని విత్తిన 30 రోజులకు వేయాలి. ఎరువులు వేసిన వెంటనే నీరు కట్టాలి.

- వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం – ఘంటసాల, న్యూస్‌టుడే

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

అరటి తోటలు కాపాడుకుందాం



తోట్లవల్లూరు, న్యూస్‌టుడే

తుపానుల సమయంలో ఈదురుగాలులు అరటి తోటలకు ముప్పు తెచ్చిపెడుతున్నాయి. కొద్దిపాటి మెలకువలతో తోటలను కాపాడుకొనే విధానాలను ఉద్యాన శాఖ అధికారి జోసఫ్ వందు వివరించారు. మూడు నుంచి నాలుగు మాసాల మొక్కల మొదళ్లకు మట్టి ఎగదోస్తే బలంగా ఎదిగి గాలులకు తట్టుకుంటాయి. కర్పూర, చక్కెరకేళి మొక్కలు రెండున్నర నుంచి మూడు మీటర్ల ఎత్తు పెరుగుతాయి. కర్పూర మొక్కలు 15 నుంచి 18 కిలోలు, చక్కెరకేళి మొక్కలు 6 నుంచి 8 కిలోల బరువు గెలలు వేస్తాయి. అధిక గాలుల నుంచి రక్షణకు వెదురు బొంగులు పాతి ఊతం ఇవ్వాలి. మొక్క నుంచి గెల బయటకు వచ్చిన 10 నుంచి 15 రోజుల్లో ఊతమిస్తే మేలు. అధిక దిగుబడినిచ్చే రకాలను, భారీగా ఎదిగిన గెలలను కాపాడుకునేందుకు రెండు బొంగులను ఊతంగా పెడితే మంచిది. తుపాను హెచ్చరికలను ముందుగా గుర్తిస్తే పక్వానికి వచ్చిన గెలలు కోసి విక్రయించుకుంటే నష్టాల నుంచి గట్టెక్కవచ్చు. పక్షుల నుంచి రక్షణకు గెలలకు ఆకులు చుట్టడం, కవర్లు తొడగడం ఉత్తమం. ఎకరాకు వెయ్యి బొంగులు అవసరం ఉంటుంది.

లేగ దూడలు.. సంరక్షణ



లేగ దూడలు ఆరోగ్యంగా ఉండాలంటే పుట్టిన వెంటనే పాడి రైతులు కొన్ని జాగ్రత్తలు పాటించాలని గంపలగూడెం మండలం నెమలి పశువైద్యాధికారి డి.అభిలాష్ సూచించారు. ఆగస్టు నుంచి అక్టోబరు వరకు ఆవులు, గేదెలు ఈనే కాలం. వర్షాకాలంలోనే పాడి పశువులు దూడలకు జన్మనిస్తాయి. దూడలు పుట్టిన వెంటనే నోటి నుంచి, ముక్కు రంధ్రాల నుంచి వచ్చే జిగురు పొరలను శుభ్రంగా తొలగించాలి. దూడ పుట్టిన గంట లోపు జున్నుపాలు పట్టిస్తే రోగనిరోధకశక్తి పెరుగుతుంది. ధనుర్వాతం రాకుండా టీటీ ఇంజక్షన్ చేయించాలి. కొన్ని దూడలకు శ్వాసక్రియ సమస్య రావచ్చు. అటువంటి దూడల హృదయ భాగాన్ని బలంగా ఒత్తడం ద్వారా శ్వాసక్రియ యథావిధిగా జరిగేలా చేయవచ్చు. పుట్టిన వెంటనే దూడ శరీరానికి రెండు అంగుళాల దూరంలో బొడ్డును నూలు దారంతో కట్టి కత్తిరించాలి. అనంతరం అయోడిన్ పూస్తే యాంటీసెప్టిక్‌గా పని చేసి గాయం త్వరగా మానుతుంది. రోగనిరోధకశక్తి పెంచడానికి వారం రోజులకు విటమిన్-ఏ ఇంజక్షన్ చేయించాలి.

– గంపలగూడెం, న్యూస్‌టుడే

కొండలమ్మ ఆలయంలో దేవీశరన్నవరాత్రులు

ఉత్సవాలకు ముస్తాబవుతున్న దేవస్థానం


వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: వేమవరం కొండలమ్మ దేవస్థానంలో ఈ నెల 3 నుంచి 12 వరకూ నిర్వహించనున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ప్రధాన ఆలయానికి రంగులు వేస్తున్నారు. ఆలయం ఎదుట ఎంఎన్‌కే రహదారిపై ఇనుపగడ్డర్లతో భారీ పందిరి వేసి చాందినీతో అలంకరిస్తున్నారు. తొలిరోజు అమ్మవారిని బాలా త్రిపురసుందరీదేవి, 4న లలితాదేవి, 5న గాయత్రి, 6న కాశీఅన్నపూర్ణ, 7న కాత్యాయని, 8న గజలక్ష్మి, 9న సరస్వతి, 10న కనకదుర్గ, 11న మహిషాసురమర్దని, 12న రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ 9 రోజుల్లో ఆలయం వద్ద ఎలాంటి మొక్కుబడులకు అవకాశం లేదు. రోజూ హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, 12న రాత్రి శమీపూజ, 10న దుర్గాష్టమి సందర్భంగా గ్రామోత్సవం, మధ్యాహ్నం అన్నసమారాధనకు సన్నాహాలు చేస్తున్నారు.



ప్రధాన ఆలయానికి రంగులు వేస్తున్న కూలీలు

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: కొల్లు రవీంద్ర

పోతేపల్లి (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తించాలని మంత్రి కొల్లు రవీంద్ర కోరారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం అమలులో భాగంగా సోమవారం మచిలీపట్నం మండలం చిన పోతేపల్లి రైతుసేవ కేంద్రం వద్ద జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ ప్రత్యేక డ్రైవ్‌లో కలెక్టర్ బాలాజీతో కలిసి మంత్రి రవీంద్ర పాల్గొన్నారు. ఈ-వ్యర్థాల సేకరణకు 10 మేజర్ పంచాయతీల్లో ఏర్పాటు చేయనున్న కియోస్క్ కేంద్రాలను కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వ్యర్థాలు భూమిలో త్వరగా కలవవని, ఇవి పర్యావరణానికి ముప్పుగా పరిణమించి మానవుల ఆరోగ్యంపై దుష్ప్రభావాలను చూపుతాయన్నారు. ఈ నేపథ్యంలో కృష్ణాజిల్లా యంత్రాంగం రాష్ట్రంలోనే తొలిసారిగా జిల్లాలో ప్రతి ఇంటి నుంచి ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ చేపట్టిందన్నారు. కలెక్టర్, పంచాయతీరాజ్ శాఖ అధికారుల చొరవను ఆయన అభినందించారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామంలో చెత్త నుంచి కంపోస్ట్ ఎరువు తయారు చేసి పంచాయతీకి సంపద సమకూరే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పోతేపల్లి గ్రామంలో జ్యుయలరీ పార్క్ కారణంగా భూగర్భ జలాలు కలుషితం అయ్యాయని, త్వరలో నీటిశుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరిస్తామన్నారు. జిల్లాలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించినందుకు హోమ్‌ల్యాండ్ ఇంజినీర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు జిల్లాకు ఎక్స్‌లెన్స్ సర్టిఫికెట్‌ను అందించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో కన్నమనాయుడు, జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ అరుణ, హోమ్‌ల్యాండ్ కంపెనీ ప్రతినిధి సుమన్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మార్కెట్‌యార్డ్ మాజీ ఛైర్మన్ గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు బండి రామకృష్ణ, కాటం మధు తదితరులు పాల్గొన్నారు.



ఎక్స్‌లెన్స్ సర్టిఫికెట్‌ను మంత్రి, కలెక్టర్‌కు అందిస్తున్న హోమ్‌ల్యాండ్ ప్రతినిధులు

త్వరలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు

పెనమలూరు, న్యూస్‌టుడే: పెనమలూరులో త్వరలో పూర్తి స్థాయి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ గంగాధరరావు పేర్కొన్నారు. తాడిగడప కూడలిలో ఏర్పాటు చేసిన పెనమలూరు ట్రాఫిక్ ఔటు పోస్టు కార్యాలయాన్ని సోమవారం ఆయన ఎమ్మెల్యే బోడేప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌శాఖ పరంగా పెనమలూరు ప్రాంతం ప్రత్యేకతను గుర్తించి పూర్తిస్థాయి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపనున్నట్లు ఆయన వెల్లడించారు. విజయవాడ- మచిలీపట్నం రహదారి, ఆయా ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందడంతో పాటు వాహనాల సంఖ్య, ట్రాఫిక్ పెరిగిపోతుండడంతో ఇక్కడ పూర్తిస్థాయి స్టేషన్ అవసరమని గుర్తించినట్లు తెలిపారు. గన్నవరం డీఎస్పీ చలసాని సురేష్, ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ, సిఐలు జె.వెంకటరమణ, జె.మురళీకృష్ణ, రామారావు, తెదేపా నేతలు అనుమోలు ప్రభాకరరావు, ధనకోటేశ్వరరావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ పోలీస్ అవుట్ పోస్టు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ గంగాధరరావు, ఎమ్మెల్యే బోడేప్రసాద్‌లు

ఒప్పంద, పార్ట్‌టైం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న ఒప్పంద, పార్ట్‌టైం, పొరుగుసేవల ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఆయా ఉద్యోగుల సంఘం ఐకాస, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మచిలీపట్నంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటరు నుంచి లక్ష్మీ టాకీస్ వరకూ ర్యాలీ నిర్వహించి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అంబేడ్కర్ విగ్రహానికి సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు, జేఏసీ నాయకులు సీహెచ్‌ఎన్ దేవేంద్రరావులు మాట్లాడుతూ ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టారు. ఉద్యోగ భద్రత కల్పించేందుకు నిర్దిష్ట విధానాన్ని ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. వివిధ కార్మిక సంఘాలకు చెందిన పోలినాయుడు, బూర సుబ్రమణ్యం, రాము, నాగమల్లేశ్వరరావు, ప్రసాద్, వెంకటేశ్వరమ్మ, తదితరులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.



లక్ష్మీటాకీస్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న ఐకాస నాయకులు

3వ తేదీ నుంచి ఏపీటెట్-2024

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: అక్టోబరు 3 నుంచి 21 వరకు ఏపీటెట్-2024 నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి తాహెరాసుల్తానా ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల నిర్వహణకు పెడన మండలంలోని నందమూరు వాసవీ ఇంజినీరింగ్ కళాశాల, కానూరు అయాన్ డిజిటల్ జోన్, శైలేష్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజి లిమిటెడ్‌లలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే ఈ పరీక్షలకు అభ్యర్థులు నిర్దేశించిన సమయానికంటే గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలన్నారు. సందేహాల నివృత్తి చేసేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఫోన్‌నెం:97008 82034లో ఉదయం 7.30 నుంచి రాత్రి 7 గంటల వరకు సంప్రదించవచ్చని సూచించారు.

కులగణన తక్షణం పూర్తి చేయాలి



ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: షెడ్యూల్ కులాల జనాభా సర్వే, కులగణనను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కులగణనను తక్షణం పూర్తి చేయాలన్న డిమాండ్‌తో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ ధర్నా చౌక్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు కంచర్ల సుధాకర్, మోహన్‌రావు, సైమన్ బాబు తదితరులు మాట్లాడారు. కులగణన లేకపోవడం వల్ల షెడ్యూల్ కులాల్లోని ఉపకులమైన మాదిగలకు రాజ్యాంగపరమైన రిజర్వేషన్లు శాపంగా మారాయన్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ బాలాజీకి వినతిపత్రం అందజేశారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, 132, 143 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 595 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

సేవా కార్యక్రమాలతో ప్రజలకు అండగా నిలుస్తాం

గండిగుంట(ఉయ్యూరుగ్రామీణం): అధికారంలో ఉన్నా లేకపోయినా పేద, మధ్య తరగతి వర్గాలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలిచేది తెదేపా నాయకులేనని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. డీజేఆర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి ఆధ్వర్యంలో రూ. 9లక్షలతో 150 కుట్టుమిషన్లు గండిగుంట దత్తదేవాలయం ప్రాంగణంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు జిల్లాలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దండమూడి సేవలు అభినందనీయమన్నారు. ఆర్టీసీ ఛైర్మన్‌గా ఎంపికైన కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ కుట్టు మిషన్లను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని కోరారు. మండల, పట్టణ తెదేపా అధ్యక్షుడు వై.కుటుంబరావు, గురునాథం, పార్టీ మండల కార్యదర్శి కాటూరి శరత్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మహిళలకు అందజేసిన కుట్టుమిషన్ల వద్ద దండమూడి చౌదరి, మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, శరత్ తదితరులు

జాతీయ రహదారిపై ప్రమాదం.. ఇద్దరి దుర్మరణం

యాచకుడ్ని ఢీకొని పల్టీకొట్టిన ఐరన్‌లోడు లారీ
అక్కడికక్కడే మృతి
ఇనుప రాడ్డుల కింద నలిగి ప్రాణాలొదిలిన డ్రైవర్



క్రేన్ సాయంతో బయటకు తీస్తున్నారిలా



ఖాదర్ బాషా మృతదేహం

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీ నూకలవారిపాలెం వద్ద జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. రోడ్డు దాటుతున్న యాచకుడిని లారీ ఢీకొని బోల్తా కొట్టిన ఘటనలో యాచకుడితోపాటు లారీపైన నిద్రిస్తున్న డ్రైవర్ కూడా మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన లారీ ఒడిశా నుంచి ఇనుప రాడ్డుల లోడుతో చెన్నై వెళ్తోంది. డ్రైవర్ షేక్ ఖాదర్‌బాషా(41)కు నిద్రరావడంతో క్లీనర్ షేక్ బాబుకు డ్రైవింగ్ అప్పగించి సోమవారం తెల్లవారుజామున లారీపైన పడుకున్నాడు. చల్లపల్లి-నూకలవారిపాలెం అడ్డరోడ్డు వద్దకు రాగానే జాతీయ రహదారిపై వెళ్తున్న యాచకుడిని ఢీకొని అదుపుతప్పి లారీ పల్టీ కొట్టింది. ఈ ఘటనలో లారీపై నిద్రిస్తున్న డ్రైవర్ ఖాదర్‌బాషా ఇనుప రాడ్డుల కిందపడి మృతిచెందాడు. లారీ ఢీకొనడంతో యాచకుడు అక్కడికక్కడే మృతిచెందగా, లారీ నడుపుతున్న క్లీనర్ షేక్‌బాబుకు కాళ్లు విరిగిపోయాయి. తెల్లవారిన తర్వాత క్రేన్లతో లారీని పైకితీసి ఇనుపరాడ్డుల కింద పడి ఉన్న డ్రైవర్ ఖాదర్‌బాషా మృతదేహాన్ని బయటకు తీసి అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఖాదర్‌బాషా సోదరుడి కుమారుడు షేక్ ఫయాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చల్లపల్లి ఎస్.ఐ. పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరద బాధిత రైతులను ఆదుకోవాలి

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలతో పాటు వరద కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. చల్లపల్లి మండలం కొత్తమాజేరు, పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు రైతులు నష్టగణన సందర్భంగా చోటు చేసుకున్న అవకతవకలపై విచారణ చేసి బాధితులను ఆదుకోవాలని కోరుతూ సోమవారం ధర్నాచౌక్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచి కె.లక్ష్మి, బాధిత రైతులు మాట్లాడుతూ పంట నష్టం నమోదు సమయంలో వ్యవసాయ సహాయకురాలు ఇష్టానుసారం వ్యవహరించారని ఆరోపించారు. నిరసన అనంతరం తమ డిమాండ్‌ను కలెక్టర్ బాలాజీ దృష్టికి తీసుకెళ్లారు.

పరిహారం అందలేదని ఆందోళన

కె.కొత్తపాలెం(మోపిదేవి), న్యూస్‌టుడే: నష్ట పరిహారం రాలేదంటూ కె.కొత్తపాలెం వరద బాధితులు.. తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. స్వయంగా సర్పంచి కొక్కిలిగడ్డ మాధవి, కో-ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు, వెంకటేశ్వరరావు బాధితులకు తీసుకొచ్చి నిరసనకు దిగారు. కె.కొత్తపాలెంలో దాదాపు 50మందికి పైగా, బొబ్బర్లంకలో ఐదుగురికి డబ్బులు జమ కాలేదని తెలిపారు. అనంతరం తహసీల్దార్ శ్రీవిద్యకు వినతిపత్రం అందించారు.



ధర్నాచౌక్‌లో నిరసన తెలియజేస్తున్న సర్పంచి, వరద బాధిత రైతులు



మోపిదేవి తహసీల్దార్ కార్యాలయం వద్ద తెదేపా శ్రేణుల నిరసన

ఉంగుటూరులో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం!

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : గన్నవరం నియోజకవర్గంలోని ఉంగుటూరు మండలంలో గత ఐదేళ్ల ప్రభుత్వ నిధులు భారీగా దుర్వినియోగం అయినట్లు పలువురు నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో పనిచేసే ఓ అధికారి ఎంపీపీ, ఎంపీడీవోలకు కూడా తెలియకుండా రూ.లక్షల నిధులను పక్కదారి పట్టించారని ఆరోపించారు. మారుమూల మండలం కావడంతో ఉన్నతాధికారుల నిఘా పెద్దగా ఉండదని అందినకాడికి దోచేశారని ప్రజావేదికలో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తాజాగా కూడా ఇక్కడే ఉంటానని.. తాను ఏ రోజు వైకాపాకు అంటకాగలేదని ప్రజాప్రతినిధి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నట్లు తెలిసింది. ప్రైవేట్ తాగునీటి ప్లాంట్‌కు ప్రభుత్వ నిధులతో విద్యుత్తు బిల్లులు చెల్లించారని పేర్కొన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులంతా ఈ విషయాలనే చర్చించుకోవడం విశేషం. వైకాపా ముసుగులో గత ఐదేళ్ల మట్టి తవ్వకాలు, జగనన్న కాలనీలకు భూసేకరణ పేరుతో రూ.కోట్లు దోచేసిన కొందరు క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బంది నియోజకవర్గంలో మండలాలు అటూ ఇటూ మారారని సత్వరమే విచారించి చర్యలు చేపట్టాలని మంత్రి లోకేశ్‌ను కోరినట్లు విశ్వసనీయ సమాచారం.

ఉద్యోగి విధులు అడ్డుకున్న కేసులో నిందితుడికి జైలు

కూచిపూడి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగి(డాక్టర్) విధులను అడ్డుకున్న వ్యక్తికి ఒక సంవత్సరం కారాగారంతోపాటు రూ.10,200 జరిమానా విధిస్తూ మొవ్వ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి పి.రాజన్ ఉదయ్‌ప్రకాష్ సోమవారం తీర్పునిచ్చారని కూచిపూడి ఎస్.ఐ. ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. కూచిపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మొవ్వ పీహెచ్‌సీలో 2020లో వైద్యుడు డాక్టర్ శొంఠి శివరామకృష్ణారావు విధుల్లో ఉండగా అదే గ్రామానికి చెందిన తుమ్మల చక్రపాణి మద్యం మత్తులో వచ్చి కేకలు వేశాడు. డాక్టర్ వచ్చి మాస్క్ లేకుండా ఎందుకు మాట్లాడుతున్నావని అడిగినందుకు నిందితుడు డాక్టర్‌పై తిరగబడి బూతులు తిట్టి చంపుతానని బెదిరించాడు. వైద్యుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అప్పటి ఎస్.ఐ. నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. ఈ కేసులో ఏపీపీ తాండవకృష్ణ, సాక్షుల వాదనలు విన్న జేఎఫ్‌సీఎం జడ్జి ఉదయ్‌ప్రకాష్ చక్రపాణికి ఏడాది జైలు, రూ.10,200 జరిమానా విధించారని ఎస్ఐ చెప్పారు.

ప్రకటన

నా క్లయింట్లు 1) మాచినేని వెంకటేశ్వరరావు గారి కుమారుడు మాచినేని అరవింద్ ఘోష్, 2) కారంపూడి సాంబశివరావు గారి కుమారుడు కారంపూడి సురేష్, 3) జాస్తి నాగభూషణం గారి కుమారుడు జాస్తి జగన్ మోహనరావు గార్ల సంజాయిషీ పొంది ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి మరియు యితర ఆస్తులను 1) మాచిన చారుమతి, వీరి సంతానము 2) మాచిన వెంకట సత్యనారాయణ, 3) వేమూరి శాంతకుమారి, 4) యనమదల భారతి గార్లు ది.23-12-1996న శ్రీ విజయవాడ సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం.2897/1996రుగా పార్టీషన్ దస్తావేజున్నూ [illegible]

ఆర్.కృష్ణ, అడ్వకేట్

డోర్ నెం.30-22-69, [illegible] ఫోన్: 98859 42416.

మచిలీపట్నం

● మచిలీపట్నం ● పెడన

సినిమాలు

రేవతి	: దేవర
మినీరేవతి	: సత్యం సుందరం
సిరికృష్ణ	: దేవర
సిరివెంకట్	: దేవర
రామరాజు	: దేవర

-మచిలీపట్నం కార్పొరేషన్

రూ.3.78 కోట్లతో 48 పనులు మంజూరు

పెడన (గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో ఉపాధి హామీ పథకం కింద రూ.3.78 కోట్ల వ్యయంతో 48 పనులు మంజూరైనట్లు ఇన్‌ఛార్జి పీఆర్ ఏఈ లోయ హరిబాబు తెలిపారు. పాఠశాలల ప్రహరీలు 3, శ్మశానవాటికల్లో 6 షెడ్ల నిర్మాణం, 39 సీసీ రహదారుల పనులకు సంబంధించి నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ పనుల్ని త్వరలో ప్రారంభిస్తామని వివరించారు.

శ్రీనివాస్ సేవలు ప్రశంసనీయం: కొల్లు



శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న మంత్రి రవీంద్ర

భాస్కరపురం (మచిలీపట్నం): తహసీల్దార్‌గా శ్రీనివాస్ అందించిన సేవలు ప్రశంసనీయమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం నార్త్ తహసీల్దార్‌గా పని చేసి సోమవారం పదవీ విరమణ చేసిన కొమ్మూరి శ్రీనివాస్ అభినందన సభ స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో సోమవారం రాత్రి జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి రవీంద్ర మాట్లాడుతూ.. ఉద్యోగ నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లకు అవకాశమివ్వకుండా, వివాదరహితుడిగా, ఉద్యోగుల శ్రేయోభిలాషిగా శ్రీనివాస్ అందించిన సేవలు చిరకాలం గుర్తుండి పోతాయన్నారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పేపేటి సత్యనారాయణ, గొర్రెపాటి గోపీచంద్, బండి రామకృష్ణ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందనకు వందనం

✦ నగరంలోని సుకర్లాబాద మసీదు సమీపంలో రహదారి పక్కన వేసిన చెత్త తొలగించకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ సమస్యను స్థానికులు మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసుకురాగా ఈనాడులో వార్త ప్రచురించి అధికారులకు సమస్యను వివరించడంతో వెంటనే స్పందించి చెత్త తొలగించి శుభ్రం చేయించారు.

✦ ఉడేవుపల్లో జోడుగుళ్ల ప్రాంతంలో వీధిదీపం పాడైందని స్థానికులు మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులకు సమస్యను చెప్పిన వెంటనే మరమ్మతులు చేయించడంతో ఆ ప్రాంతవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

? కలెక్టరేట్ నుంచి కొబ్బరితోట వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. వర్షం వస్తే చాలు గుంతల్లో నీళ్లు నిలబడిపోతున్నాయి.
-స్థానికులు



గుంతలమయంగా కొబ్బరితోట రహదారి

✔ నగరంలోని వివిధ రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశాం. త్వరలోనే రోడ్లు నిర్మించేందుకు కృషి చేస్తాం.
- బాపిరాజు, నగరపాలక సంస్థ కమిషనర్, మచిలీపట్నం

? నగరంలోని కలెక్టరేట్ ఎదుట రహదారి పక్కన ఏర్పడిన పైపులైన్ లీకు కారణంగా కొన్ని రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది.
-స్థానికులు



కలెక్టరేట్ ఎదురుగా లీకు కారణంగా రహదారిపై చేరిన నీరు

✔ సిబ్బందిని పంపి లీకు మరమ్మతులు చేయించే చర్యలు తీసుకుంటాం.
-బాపిరాజు, నగరపాలక సంస్థ కమిషనర్,మచిలీపట్నం
– న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

? పోతేపల్లి గ్రామ ప్రధాన రహదారి గుంతలతో దారుణంగా మారింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
-శ్రీనివాసరావు, పోతేపల్లి

✔ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే నిర్మాణం ప్రారంభిస్తాం.
- సురేష్, ఆర్అండ్‌బి ఏఈ
– న్యూస్‌టుడే, మచిలీపట్నంరూరల్

పల్లె మోములో కాంతిరేఖలు

సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.19.6కోట్లు మంజూరు

2025 మార్చికి పూర్తి చేయాలని ఆదేశాలు

న్యూస్‌టుడే, మచిలీపట్నం గ్రామీణ

బటన్ నొక్కడమే పరమార్థంగా నాటి వైకాపా ప్రభుత్వం పాలన సాగించింది. ప్రజావసరాలకు పెద్దపీట వేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. పల్లెమోములో కాంతిరేఖలు నింపుతూ మచిలీపట్నం నియోజకవర్గంలో 34 పంచాయతీలకు సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.19.60 కోట్లు విడుదల చేసింది.

★ నియోజకవర్గంలో ఐదు గ్రామాల్లో శ్మశానాలకు ప్రహరీల నిర్మాణానికి రూ.2.28 కోట్లు మంజూరు చేసింది. చిన్నాపురంలో రూ.60 లక్షలు, పోతేపల్లిలో రూ.50లక్షలు, చినపోతేపల్లిలో రూ.50లక్షలు, గుండుపాలెంలో రూ.18. లక్షలు, మేకావానిపాలెంలో రూ.50 లక్షలు మంజూరయ్యాయి.



కోనలో ఇటీవల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి రవీంద్ర

పంచాయతీల వారీగా మంజూరైన పనులు, నిధుల వివరాలు ఇలా ..

పంచాయతీ	పనులు	మీటర్లు	రూ.లక్షల్లో
1. అరిశేపల్లి	7	691	41.46
2. భోగిరెడ్డిపల్లి	11	1083	64.98
3. బొర్రపోతుపాలెం	6	623	37.38
4. బుద్దాలపాలెం	9	597	35.82
5. చినకరఅగ్రహారం	15	864	51.84
6. చిన్నాపురం	26	1957	117.42
7. సిరివెళ్ళపాలెం	11	700	42.00
8. గరాలదిబ్బ	1	750	45.00
9. గోకవరం	11	857	51.42
10. గొల్లపాలెం	14	777	124.20
11. గోపువానిపాలెం	8	2070	124.20
12. గుండుపాలెం	11	550	33.00
13. కెపిటి పాలెం	8	500	30.00
14. కానూరు	11	818	49.08
15. కరఅగ్రహారం	12	1471	88.26
16. కోన	6	776	46.56
17. మంగినపూడి	9	489	29.34
18. మేకావానిపాలెం	13	1535	93.12
19. నెలకుర్రు	7	838	50.28
20. పల్లెతుమ్మలపాలెం	4	660	39.60
21. పెదపట్నం	9	709	42.54
22. పెదయాదర	15	1200	72.00
23. పోలాటితిప్ప	10	1500	90.00
24. పోతేపల్లి	12	1515	90.90
25. పోతిరెడ్డిపాలెం	4	720	43.20
26. పొట్లపాలెం	10	855	51.30
27. రుద్రవరం	12	745	44.70
28. ఎస్.ఎన్.గొల్లపాలెం	8	975	58.50
29. సీతారామపురం	3	710	42.60
30. సుల్తానగరం	4	892	50.32
31. తాళ్ళపాలెం	17	2238	143.88
32. తపసిపూడి	7	413	24.78.
33. తుమ్మలచెరువు	3	620	37.20
34. వాడపాలెం	14	855	51.30
	328	32,553	రూ.19.6కోట్లు

పెడనను మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతాం

❑ 2050 లక్ష్యంగా అభివృద్ధి పనులు ❑ ఛైర్‌పర్సన్ నాగకుమారి వెల్లడి



కౌన్సిల్ సమావేశానికి హాజరైన వివిధ వార్డుల కౌన్సిలర్లు

పెడన, న్యూస్‌టుడే: పెడన పట్టణాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. వివిధ వార్డుల కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ..ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌ల సహకారంతో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను త్వరితగిన చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వంలో రూ.93కోట్ల ఏఐబీ నిధులతో చేపట్టిన నీటి పథకం అభివృద్ధి పనులను పున:ప్రారంభించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. పట్టణంలో డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి రూ.6కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఎస్టీపీలను ఏర్పాటు చేస్తామని, రోడ్ల విస్తరణకు చర్యలు చేపడతామని ఆమె చెప్పారు.



సభాధ్యక్ష స్థానంలో ఛైర్‌పర్సన్, చిత్రంలో అధికారులు

అంశాలకు ఆమోదం: అజెండాలో పొందుపర్చిన తొమ్మిది అంశాలను ఈ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. మాజీ ఛైర్‌పర్సన్ల చిత్రపటాలను కౌన్సిల్ హాల్లో ఉంచాలన్న అంశానికి, ఇటీవల పట్టణంలో ముంపు తొలగింపునకు చేపట్టిన పనులకు సంబంధించి టెండర్లకు సభ్యులు ఆమోదం తెలిపారు. బదిలీపై వచ్చిన అధికారులు, ఉద్యోగులను కమిషనర్ గోపాలరావు సభ్యులకు పరిచయం చేశారు. సమావేశంలో వైస్‌ఛైర్మన్ ఖాజా, టౌన్ ప్లానింగ్ అధికారిణి సృజనకుమారి, ఏఈ కాగిత సీతారామాంజనేయులు, కౌన్సిలర్లు కటకం ప్రసాద్, గరికిముక్కు చంద్రబాబు, మట్టా శివపావని తదితరులు పాల్గొన్నారు.

హాజరు సక్రమంగా నమోదు చేయలేదు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకుంటామని డ్వామా ఏవో నాగ మహేశ్వరరావు తెలిపారు. ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక సోమవారం ఉదయం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరిపారు. సామాజిక ఆడిట్ బృందాలు 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జరిగిన పనులపై నివేదకల్ని అందజేశారు. ఎస్ఆర్పీలు, డీఆర్పీలు పరిశీలన చేసి అందజేసిన విషయాలపై సంబంధిత క్షేత్ర సహాయకులపై చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు. తనిఖీ చేపట్టిన డీఆర్పీలు సభలో మాట్లాడుతూ హాజరు పట్టీల్లో కొట్టివేతలు, దిద్దుళ్లు ఉన్నాయని, వివరాలు సక్రమంగా నమోదు చేయలేదని స్పష్టం చేశారు. పనులు జరిపిన చోట్ల నామ ఫలకాలు పెట్టలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఏపీవో వజీర్ మాట్లాడుతూ గత ఏడాది చెరువులు, సేద్యపు నీటి గుంతలు, పంట బోదెలు, మురుగు కాల్వలు, తదితర 1221 పనుల్ని రూ.7.43 కోట్ల వ్యయంతో చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో డ్వామా అంబుడ్స్‌మన్ శ్రీనివాసరావు, ఎంపీడీవో వీరమల్లు రెడ్డియ్య, ఎస్ఆర్పీలు సిహెచ్ సత్యన్నారయణ, ఈశ్వరరావు, డ్వామా విజలెన్సు ఏఈవో సురేష్, పీఆర్ ఏఈ లోయ హరిబాబు, టీఏ కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణ...అభిషేకాలు



వట్టివేళ్ల అలంకరణలో స్వామివారు



ప్రత్యేక పూజలు అందుకున్న నందీశ్వరుడు

గూడూరు,న్యూస్‌టుడే: ఐదుగుళ్లపల్లిలో పార్వతీసమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రదోషకాల పూజలు నిర్వహించారు. స్వామివారితోపాటు నందీశ్వరునికి ఏకకాలంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం జరిపించారు. అనంతరం స్వామివారిని, నందీశ్వరుని వట్టివేళ్లతో అలంకరించి పూజా క్రతువులు జరిపించారు.

స్వార్థంతో తిరుమల ప్రతిష్ఠను మసకబార్చారు



బంటుమిల్లి వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో పూజల అనంతరం ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, అర్చకులు తదితరులు

బంటుమిల్లి, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం తన స్వార్థం కోసం ఎంతో పవిత్రమైన తిరుమల వేంకటేశ్వరస్వామి వారి లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యిని వినియోగించి అపవిత్రం చేసిందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. ఈ పాపానికి ఒడిగట్టిన వారు ఎంతటి వారైనా క్షమించేది లేదని, వారిపై చర్యలు తీసుకోవడం తప్పదని హెచ్చరించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దీక్షకు మద్దతుగా ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వేంకటేశరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణాన్ని, ప్రధాన ద్వారాన్ని శుభ్రం చేశారు. జనసేన కృష్ణా జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, పెడన ఇన్‌ఛార్జి పంచకర్ల సురేష్, మండల కన్వీనర్ ర్యాలీ సత్యనారాయణ, తెదేపా మండల కార్యదర్శి బొర్రా కాశీ విశేశ్వరరావు, సర్పంచి ఓరుగంటి చలం తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణకు పూజలు



దీపారాధన చేస్తున్న బండి రామకృష్ణ, కార్పొరేటర్ ఛాయాదేవి తదితరులు



కృత్తివెన్ను: వేంకటేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగించి..

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: సనాతనధర్మ పరిరక్షణలో భాగంగా సోమవారం నగరంలోని గొడుగుపేట వెంకటేశ్వరస్వామి ఆలయంలో జనసేన ఆధ్వర్యంలో విశేష పూజలు, లక్ష వత్తుల దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ, కార్పొరేటర్ పినిశెట్టి ఛాయాదేవి, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, శాయనశివ తదితరులతో పాటు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని వేదపండితుల ఆధ్వర్యంలో పూజా క్రతువులు జరిపించారు.

పవన్ దీక్షకు దీపాలతో మద్దతు

లక్ష్మీపురం (కృత్తివెన్ను), న్యూస్‌టుడే: లక్ష్మీపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కూటమి నాయకులు, మహిళలు దీపాలు వెలిగించి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేస్తున్న దీక్షకు మద్దతు తెలిపారు.

ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ఇచ్చే ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపుతామని ఎస్పీ గంగాధరరావు స్పష్టం చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన వారి వద్ద నుంచి ఎస్పీ, ఏఎస్పీ ఎస్‌వీడీ ప్రసాద్‌తో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. వివాహ సమయంలో కట్నంగా ఇచ్చిన భూమిని తన పేరున రిజిస్ట్రేషన్ చేసేందుకు సోదరులు అడ్డుగా నిలవడమే కాకుండా ప్రశ్నించినందుకు భౌతికదాడులకు పాల్పడుతున్నారని మచిలీపట్నంకు చెందిన ఓ వివాహిత ఫిర్యాదు సమర్పించారు. వివిధ వ్యక్తిగత ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ విచారించి చట్ట పరిధిలో న్యాయం చేయాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఏఎస్సైలకు ఆత్మీయ వీడ్కోలు : ఏఎస్సైలుగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన పి.బాలకృష్ణారావు, టి.వెంకటేశ్వరరావులకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు.

రుణమాఫీ పత్రం పంపిణీ : పోలీస్ కోఆపరేటివ్ సొసైటీలో రుణం తీసుకుని పూర్తి మొత్తం చెల్లించకుండానే మృతి చెందిన ఏఎస్సై సుబ్బారావుకు సంబంధించిన రూ.3.15లక్షల రుణమాఫీ పత్రాన్ని ఆయన సతీమణి జయలక్ష్మికి ఎస్పీ గంగాధరరావు అందజేశారు. మట్టి ఖర్చులకు సంబంధించి రూ.10వేలు కుటుంబీకులకు అందజేశారు.

నేడు గరిశపూడిలో ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

కృత్తివెన్ను, న్యూస్‌టుడే: కృత్తివెన్ను మండలంలో మంగళవారం ఉదయం 10గంటలకు ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌లు పర్యటిస్తారని మండల తెదేపా అధ్యక్షుడు ఒడుగు తులసీరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

గుండెపోటుతో జనసేన కార్యకర్త మృతి



మణికంఠ (పాతచిత్రం)

కప్పలదొడ్డి(గూడూరు), న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వీరాభిమాని, జనసైనికుడు జంపాన మణికంఠ (19) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. మణికంఠ చిన్న వయసులోనే మృతి చెందడం తీవ్రంగా కలిచివేసిందన్నారు. దివ్యాంగుడైనా జనసేనపై అభిమానంతో ఎప్పుడూ తన సైకిల్‌కు జెండా కట్టుకుని తిరుగుతుంటాడని, పవన్‌కల్యాణ్‌ను కూడా కలిసి మాట్లాడిన ఘటనలను స్థానికులు గుర్తుచేసుకున్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న సువర్ణ తదితరులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ పోషకాలతో కూడి ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ ఎస్.సువర్ణ అన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నిర్వహిస్తున్న పోషకాహార మాసోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం నగరంలోని నారాయణపురం సెక్టార్‌లో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. పోషకాహారం లోపం వల్ల రక్తహీనత బారిన పడాల్సి వస్తుందన్నారు. సీడీపీవో గ్లోరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాలతీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

బంటుమిల్లి, న్యూస్‌టుడే: చిరుధాన్యాలలో అధిక పోషకాలు ఉంటాయని, ప్రతి ఒక్కరూ వాటిని ఆహారంగా తీసుకోవడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు మరింత ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగలక్ష్మీ అన్నారు. పోషకాహార మాసోత్సవాలు ముగింపు సందర్భంగా మండలంలోని నాగన్న చెరువులో సోమవారం గర్భిణులు, బాలింతలు, తదితరులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సర్పంచి తమ్మినీడి అరుణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైస్తవ భవన్ నిర్మాణానికి చంద్రబాబు కృషి

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: గుంటూరు క్రైస్తవ భవన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేయడంపై క్రైస్తవులు అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఐపీసీ కరుణ్‌కుమార్ అన్నారు. సోమవారం నగరంలోని తెదేపా నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెదేపా ప్రభుత్వ హయాంలోనే రెండెకరాల స్థలం కేటాయించి, క్రైస్తవ్ భవన్ నిర్మాణానికి చంద్రబాబు నిధులు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పట్లోనే 90 శాతం వరకు పనులు పూర్తయ్యాయని, కానీ ఆ తరువాత క్రైస్తవుల ఓట్లతో గద్దెనెక్కిన జగన్ ఆ భవనాన్ని మూసివేయించారని విమర్శించారు. మచిలీపట్నం రూరల్, అర్బన్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు వి.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆటో చోరీ.. గంటన్నరలో ఛేదించి..

కూచిపూడి, న్యూస్‌టుడే: అయ్యంకి గ్రామానికి చెందిన పడమటి నాగరాజు ఆటో నడుపుకుంటూ, పొలం పనులు చేసుకొని జీవిస్తున్నాడు. సోమవారం కూచిపూడి - మొవ్వ గ్రామాల మధ్య పొలానికి మందు పిచికారీ చేసి తిరిగి రాగా రోడ్డు పక్కన పెట్టిన ఆటో కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదుతో ఎస్ఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక సమాచారంతో పామర్రుకు చెందిన గండ్రెడ్డి శివ ఆటో చోరీ చేశాడని తెలుసుకున్నారు. వెంటనే అతడ్ని అదుపులోకి తీసుకొని గంటన్నరలో ఆటో రికవరీ చేశారు.

కుంగిన రహదారి



కమలాపురం వద్ద బీటలు వారిన ఆర్అండ్‌బీ రహదారి

పెడనగ్రామీణం, న్యూస్‌టుడే: కమలాపురం వద్ద ఆర్అండ్‌బీ రహదారి తిరిగి బీటలు వారింది. గతంలో వడ్లమన్నాడు నుంచి చెన్నూరు మార్గంలో కమలాపురం వద్ద రహదారి కుడివైపు కోతకు గురి కాగా ఇటీవల మరమ్మతులు చేశారు. ఇప్పుడు అదే ప్రాంతంలో ఎడమవైపుగా రహదారి బీటలు వారింది. ఈ రహదారి నుంచి రోజూ భారీ వాహనాలు ప్రయాణాలు సాగిస్తుంటాయి. రహదారికి ఇరువైపులా బలం చేకూర్చేలా నిర్మాణం సాగాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువ గండిని పూడ్చించిన బండి



కాలువ గండిని పూడుస్తూ..

ఒన్నార్‌కానూరు (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: ఒన్నార్ కానూరు గ్రామంలో కాలువకు గండిపడడంతో రహదారిపై నడవడానికి కూడా ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న జనసేన నేత బండి రామకృష్ణ గండిని సోమవారం పూడ్చించారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, కానూరు జనసేన పార్టీ ఇన్‌ఛార్జి దివి మహేష్, గమిడి శ్రీనివాసరావు, గణపాబత్తుల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత

తాడేపల్లి, న్యూస్‌టుడే: వరద బాధితులకు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన దాతలు అండగా నిలిచారు. సోమవారం ఉండవల్లిలోని నివాసంలో మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విరాళాలు అందజేశారు. తెనాలి పిడవర్తిపాలేనికి చెందిన అరుణోదయ మహిళా గ్రూప్ ఆధ్వర్యాన రూ.1.21 లక్షలు, కృష్ణాజిల్లా మచిలీపట్నానికి చెందిన ఎం. ధనలక్ష్మి రూ.లక్ష విరాళంగా ఇచ్చారు.

ఏపీయూఎస్ బంటుమిల్లి అధ్యక్షుడిగా సత్యనారాయణ



నాగ సత్యనారాయణ

బంటుమిల్లి, న్యూస్‌టుడే: ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) బంటుమిల్లి మండల అధ్యక్షుడిగా మద్దిబోయిన నాగ సత్యనారాయణ నియమితులయ్యారు. సోమవారం బంటుమిల్లిలో జరిగిన సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ బంటుమిల్లి మండల కమిటీని ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా రాయపురెడ్డి నాగమణి, కోశాధికారిగా కంచర్లపల్లి చంద్రప్రభ నియమితులయ్యారు. అనంతరం వీరు సంఘం నాయకులు ఎంఈవోలు బాలా త్రిపుర సుందరి, వెంకటేశ్వరరావులను కలిసి కమిటీ నియామక తీర్మానాన్ని, జ్ఞాపికలను వారికి అందించారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు నిరుపమానం



కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్, వైద్య సిబ్బంది, కార్మికులు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికుల సేవలు నిరుపమానమని నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు అన్నారు. స్వచ్ఛతాహీ సేవలో భాగంగా నగరపాలకసంస్థ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

రుద్రవరం (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిదుతున్న ఇద్దరు పారిశుద్ధ్య కార్మికులను రుద్రవరం తెదేపా నాయకులు, గ్రామస్థులు, పంచాయతీ సిబ్బంది సోమవారం సన్మానించారు. శ్రీనివాసరావు, విక్టోరియా పారిశుద్ధ్య కార్మికులుగా తమ విధులను చిత్తశుద్ధితో నిర్వహించారని తెదేపా గ్రామ అధ్యక్షుడు నీలం రమేష్ కొనియాడారు. కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకుడు నీలం రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి అజయ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెడన, న్యూస్‌టుడే: మున్సిపల్ ప్రజారోగ్య విభాగం కార్మికులకు స్థానిక అర్బన్ హెల్త్ కేంద్రంలో సోమవారం వైద్య పరీక్షలను నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సాయి ప్రీతి, మున్సిపల్ కమిషనర్ మన్నం గోపాలరావు, కౌన్సిలర్లు కటకం ప్రసాద్, పిచ్చుక సతీష్ పాల్గొన్నారు.

పోలీస్ జాగిలానికి నివాళి



జిల్లా పోలీస్‌శాఖలో దాదాపు 9 సంవత్సరాల పాటు సేవలందించి అనారోగ్యంతో మృతి చెందిన పోలీస్ జాగిలం గ్లాడికి పరేడ్ మైదానంలోని అమరవీరుల స్థూపం వద్ద ఎస్పీ గంగాధరరావు నివాళి అర్పించారు.
–మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

'సాయం'లో పొరపాట్లు సరిదిద్దాలి


నాగరత్నాలు, తెన్నేరు


లక్ష్మీదేవి, తెన్నేరు

తెన్నేరు (కంకిపాడు), న్యూస్‌టుడే: వివిధ కారణాలతో అర్హులైన కొందరికి వరద సాయం అందలేదని చెబుతున్నారు. ✱ తెన్నేరు ఎస్సీ కాలనీలోని జోజే ప్రసాద్ నగర్‌లో నివాసం ఉంటున్న జుజ్జువరపు నాగరత్నాలు ఇల్లు పూర్తిగా బుడమేరు వరదలో ముంపునకు గురైంది. సర్వే సమయంలో ఇంటి వద్ద లేకపోవడంతో ఈమె పేరు నమోదు కాలేదు. దీంతో ప్రభుత్వ సాయం రూ.10వేలు అందలేదు. వాస్తవ బాధితులకు సాయం అందజేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

✱ తెన్నేరుకు చెందిన జుజ్జువరపు లక్ష్మీదేవికి అదే గ్రామ పరిధిలో 2.37 ఎకరాల పొలం ఉంది. బుడమేరు వరదకు పైరు పూర్తిగా దెబ్బతింది. దీనికి ప్రభుత్వ సాయం రూ.23,750 జమ కావాల్సి ఉండగా రూ.2,375 మాత్రమే ఖాతాలో వేశారు. పొరపాటున చివర 'సున్న' తొలగి ఉంటుందని భావిస్తున్నారు. ఇటువంటి పొరపాట్లను సరిచేయాలని సూచిస్తున్నారు.

సృజనాత్మకత ఉంటేనే రాణింపు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : చదువుకు సృజనాత్మకత తోడైతేనే విద్యార్థులు ఉన్నతంగా రాణించగలుగుతారని ఎంఈవోలు శ్రీరామ్ బాలాసింగ్, సురేష్‌కుమార్ తెలిపారు. సోమవారం బాపులపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 'బెస్ట్ ఔట్ ఆఫ్ వేస్ట్' పోటీలు నిర్వహించారు. ఇందులో మండలం వ్యాప్తంగా ఉన్న వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన పలు నమూనాలు ఆసక్తి రేపాయి. అనంతరం 'సేవ్ గర్ల్ చైల్డ్' అనే అంశం మీద విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.


విద్యార్థులు రూపొందించిన నమూనాలను తిలకిస్తున్న ఎంఈవోలు శ్రీరామ్ బాలాసింగ్, సురేష్‌కుమార్

చదువుకున్న బడికి చేయూతనివ్వాలి

ఉయ్యూరు, న్యూస్‌టుడే: మంచి స్థానాలకు చేరిన పూర్వ విద్యార్థులు వారు చదివిన పాఠశాల అభివృద్ధికి చేయూతనివ్వాలని ఉయ్యూరు జడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆరేపల్లి శివసాయిప్రసాద్ అన్నారు. పాఠశాలలో 2002లో పదో తరగతి చదివిన శివసాయిప్రసాద్ ఇప్పుడు పాఠశాల చైర్మన్‌గా సేవలందిస్తున్నందుకు సోమవారం ఆయన్ని ఘనంగా సత్కరించారు. పూర్వవిద్యార్థులు ముమ్ముందు పాఠశాల అభివృద్ధికి తనవంతు సహాయం చేస్తామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వప్నదేవి ఉన్నారు.


కమిటీ చైర్మన్ ఎ.శివసాయిప్రసాద్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

పరిహారం రాలేదంటూ రగడ

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : బాపులపాడు మండలం ఓగిరాలలో వరద బాధితులందరికీ పరిహారం రాలేదంటూ సోమవారం గ్రామస్థులు ఆందోళనకు దిగారు. తాము నష్టపోయినా, సర్వే సమయంలో రెవెన్యూ, పంచాయతీ అధికారులు కావాలనే తమ పేర్లు జాబితాల్లో నమోదు చేయలేదంటూ ఆగ్రహించారు. బాధితులందరికీ ఇప్పటికే ప్రభుత్వం ఖాతాల్లో నగదు జమ చేసిందని, తమకు మాత్రం రాలేదంటూ వీఆర్వోను నిలదీశారు. అర్హులందరి వివరాలు తమకు పక్కాగా అందాయని, ఎవరైనా జాబితాలో పేరు లేకుంటే వివరాలు ఇవ్వాలని సూచించారు. సమాచారం తెలుసుకున్న హనుమాన్ జంక్షన్ ఎస్సై జనార్దన్ ఘటనా స్థలానికి వెళ్లి ఆందోళనకారులకు నచ్చజెప్పారు.

అడ్డగోలు పనులు.. అడిగేదెవ్వరూ..!

అసంపూర్తిగా అభివృద్ధి

పత్తా లేని గుత్తేదారు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే

హనుమాన్ జంక్షన్ పరిధిలో ఏడు నెలల కిందట చేపట్టిన 16వ జాతీయ రహదారి అభివృద్ధి పనులు నేటికీ అసంపూర్తిగానే మిగిలాయి. రికార్డు స్థాయిలో 34 శాతం తక్కువకు ఈ పనులు చేపట్టిన గుత్త సంస్థ ఆరంభం నుంచి అస్తవ్యస్తంగానే వ్యవహరిస్తోంది. తారురోడ్డు కొత్తగా వేశారంటే నమ్మలేని రీతిలో నిర్మాణం చేయడం, డ్రైనేజీకు ఇంకా ఔట్‌లెట్ అనుసంధానించకపోవడం, నాలుగు నెలల కిందట విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేసి ఇప్పటి వరకు దీపాలు వెలిగించక పోవడం పనుల నిర్వహణ ఎలా ఉందనే దానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

దారుణంగా రహదారి..

హనుమాన్ జంక్షన్ బైపాస్ ఆరంభమయ్యే చోటు నుంచి రామిలేరు వంతెన వరకు 5.120 కి.మీ మేర ఉన్న పాత 16వ జాతీయ రహదారి పునర్నిర్మాణం, డ్రైనేజీల అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్, రంగులు వేయడం, మొక్కలు నాటడం తదితర పనులు చేపట్టారు. రూ.9,72,74,023 వ్యయంతో అంచనాలు రూపొందిస్తే, గుత్తసంస్థ రూ.6,36,56,120.66కే ఈ పనులు పూర్తి చేస్తామంటూ టెండర్లు దక్కించుకుంది. తక్కువ మొత్తానికి పనులు దక్కించుకున్న సదరు సంస్థ, మిల్లింగ్(ఉన్న రోడ్డు పైభాగంలో తారుని పూర్తిగా తీసేయ్యడం) మొదలుకుని రహదారి నిర్మాణం పూర్తయ్యే వరకు పనులు నిర్వహించిన తీరు, 5 కి.మీ రోడ్డుని విడతల వారీగా మూడు నెలల పాటు నిర్మించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి.


మురుగు నిలుస్తోంది

ముందుగా డ్రైనేజీ పనులు చేపట్టిన గుత్త సంస్థ శేరీనరసన్నపాలెం రహదారి పక్కన కచ్చా డ్రెయిన్‌ను తవ్వి, శాశ్వత డ్రైనేజీ నిర్మాణం చేపట్టింది. కాల్వ నిర్మాణం కూడా కొంత పూర్తి చేశారు. ఆ తర్వాత అనూహ్యంగా కొన్ని రోజుల తర్వాత డ్రైనేజీ నిర్మాణాన్ని పూర్వ జాతీయ రహదారి వైపునకు మార్చారు. కీలక పనులకు సంబంధించి ముందస్తు ప్రణాళిక లేకుండా డ్రైనేజీని అటు, ఇటు మార్చడం గమనార్హం. ఎట్టకేలకు డ్రైనేజీ పూర్తి చేశామనిపించినా, ఇప్పటికీ అవుట్‌లెట్‌ను అనుసంధానించక పోవడంతో మురుగు స్తంభించిపోతోంది. దీంతో గత నెలలో వచ్చిన వరదలకు నీరంతా రోడ్డుపైనే వారాల తరబడి నిలిచిపోయింది.


డ్రైనేజీ ఔట్‌లెట్ లేక ఇదీ పరిస్థితి

స్తంభాలతో సరి..

వేలేరు శివారు నుంచి రామిలేరు వరకు, గుడివాడ, నూజివీడు రోడ్లలో కొంతమేర సెంట్రల్ లైటింగ్ కోసం దాదాపుగా 150 స్తంభాలు మూడు నెలల కిందట ఏర్పాటు చేశారు. వీటికి దీపాలు కూడా బిగించినా, ఇప్పటి వరకు విద్యుత్తు సౌకర్యం కల్పించ లేదు. దీంతో సెంట్రల్ లైటింగ్ అలంకారప్రాయంగా మిగిలింది. పైగా పలు స్తంభాలు పక్కకు వాలిపోతున్నాయి. ఈ రహదారిని ఆర్అండ్‌బీకు అప్పగించిన తర్వాత వారి ఆధ్వర్యంలో దీపాలు వెలిగించే ప్రక్రియ చేపడతారంటూ ఎన్‌హెచ్ఏఐ అధికారులు చెప్పిన మాట రెండు నెలలుగా ఆచరణకు మాత్రం నోచుకోలేదు.


స్తంభాలు వేసి వదిలేశారిలా..

ఎక్కడివక్కడే...

ఆర్అండ్‌బీకు రోడ్డు అప్పగించే క్రమంలో డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేయడం, మరో పొర తారు వేయడం, డివైడర్ మధ్యలో ఇనుప గ్రిల్ అమర్చడం, గడ్డి తొలగించి మొక్కలు నాటడం, కొత్తగా డివైడర్ గ్యాప్‌లు ఇచ్చిన చోట జీబ్రా లైన్లు, స్టాపర్ లైన్లు వేయడం, సెంట్రల్ లైటింగ్ కోసం అమర్చిన ప్రతి స్తంభానికి ఒకదాని నుంచి మరొక దానికి విద్యుత్తు కనెక్షను ఇవ్వడం వంటి పనులు చేపట్టాల్సి ఉంది. కానీ గుత్త సంస్థ ఈ దిశగా కార్యాచరణేదీ ప్రారంభించ లేదు.

☛ దీనిపై ఎన్‌హెచ్ఏఐ ఇంజినీర్ నాగేశ్వరరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా అసంపూర్తిగా ఉన్న పనుల్ని పూర్తి చేయిస్తామని తెలిపారు. సెంట్రల్ లైటింగ్ బాధ్యత ఆర్అండ్‌బీదేనని చెప్పారు.

ఐదేళ్ల దోపిడీ పాలనతో అభివృద్ధి దూరం

ఉయ్యూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గత ఐదేళ్ల పాటు వైకాపా నాయకుల దోపిడీకి కృష్ణా జిల్లా అన్ని విధాలుగా బలైపోయిందని మంత్రి కొల్లు రవీంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గండిగుంటలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. వైకాపా నేతలు వల్లభనేని వంశీ, పేర్ని నాని వంటి మరికొంత మంది నేతల వల్ల జిల్లా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇటీవల జిల్లాలో వరదలు వచ్చినా కనీసం ప్రజలను పలకరించేందుకు ఒక్క వైకాపా నాయకుడూ రాలేదని విమర్శించారు. వరద బాధితులను ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నివిధాలుగా ఆదుకుంటున్నారన్నారు.

సామూహిక సీమంతాలు

కానూరు: పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా కానూరు అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కంకిపాడు సీడీపీవో బేబీసుకన్య మాట్లాడుతూ.. గర్భిణులు మంచి పోషకాహారం తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక


ఆర్టీసీ చైర్మన్ కొనకళ్లను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రెడ్డమ్మ, కోటేశ్వరరావు, తదితరులు

కానూరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణను సోమవారం అమరావతి ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు కొనకళ్ల రెడ్డమ్మ మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు బొడ్డు కోటేశ్వరరావు, నాయుడు, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఆక్యుపంక్చర్‌కు కేంద్రం గుర్తింపు కొనకళ్ల కృషే

కానూరు, న్యూస్‌టుడే: బందరు మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు ప్యానెల్ స్పీకర్‌గా ఉన్న సమయంలో ఆక్యు పంక్చర్‌కు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి గుర్తింపు వచ్చేలా కృషి చేశారని ఇండియన్ ఓం చైర్మన్ మాకాల సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆయనను కలిసి అభినందించారు. సంఘం అధ్యక్షుడు ఏ.రవి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని చిన్నఅవుటపల్లి సమీపంలోని చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఉంగుటూరు మండలం పొట్టిపాడుకు చెందిన కాటూరి రాజశేఖర్(35) తాపీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. గన్నవరం శివారు దావాజీగూడెంలోని సోదరి ఇంటికి వచ్చిన రాజశేఖర్.. తిరుగు ప్రయాణమవ్వగా పట్టణ శివారులోని హైవేపై వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ అతడి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన రాజశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై భార్య ఫిర్యాదు మేరకు ఆత్కూరు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : ఉంగుటూరు మండలం ఇందుపల్లిలో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. ముందస్తు సమాచారంతో సీహెచ్.మురళీకృష్ణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేసి 180ఎంఎల్ 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

తాగి వాహనం నడిపితే మూడు నెలల జైలు

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: కంకిపాడు కూడలిలో సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఎస్సై సందీప్ నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల్లో ముగ్గురు వ్యక్తులు మద్యం తాగి పట్టుబడ్డారు. వారిని సోమవారం ఉదయం కోర్టుకు హాజరుపర్చగా ఒక్కొక్కరికీ రూ.10వేల జరిమానా, మూడు నెలల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : పోలింగ్ కేంద్రాలు గ్రామాలకు దూరంగా ఉన్నందుకు కొందరు ఓటు వేసేందుకు వెనకడుగు వేస్తున్నారని.. ఆయా ప్రాంతాల్లో స్థానికంగానే కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా సవరణ 2025లో భాగంగా సమావేశాన్ని ఎన్నికల నమోదు అధికారి షేక్ షహీద్‌బాబు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం నియోజకవర్గ ఓటర్లు మొత్తం 2,79,141గా ఉన్నారన్నారు. బాపులపాడు మండలం రంగయ్యఅప్పారావుపేటకు సంబంధించిన 610 ఓటర్లు తమ ఓటును వినియోగించుకోవాలంటే 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న కానుమోలు 238, 239 పోలింగ్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని.. కావున స్థానికంగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని తెదేపా ప్రతినిధి ఆళ్ల గోపాలకృష్ణారావు కోరారు. ప్రసాదంపాడులోని బూత్ నం.51లోని ఓటర్ల పరిస్థితి ఇదేనని సత్వరమే ఆయా కేంద్రాలను మార్చాలన్నారు. అందుకు సంబంధించిన వినతిపత్రాన్ని ఈఆర్వో, ఏఈఆర్వో తహసీల్దార్ శివయ్యలకు అందజేశారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు నాదెళ్ల మోహన్, తంగిరాల శ్రీనివాసరావు, డీటీలు గోపాల్‌రెడ్డి, భవానీ తదితరులు పాల్గొన్నారు.


రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చిస్తున్న ఎన్నికల నమోదు అధికారి షహీద్‌బాబు, పక్కన తహసీల్దార్ శివయ్య


గోడప్రతులను ఆవిష్కరిస్తున్న శ్రీలక్ష్మి, బొర్రా ప్రసాద్ తదితరులు

పుస్తకం ఒక మంచి నేస్తం

రామవరప్పాడు, న్యూస్‌టుడే : విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలు ఉత్తమ మిత్రులు వంటివని ప్రొఫెసర్ శ్రీలక్ష్మి అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నూతనంగా 'పుస్తక సమీక్షకుల సంఘాన్ని' ఏర్పాటు చేసి దీని కరపత్రాలు ఆవిష్కరించారు. కళాశాల ప్రథమ సీఎస్ఈ విద్యార్థిని పి.గీతికా 'గుడ్ వైబ్స్', 'గుడ్ లైఫ్' పుస్తకాన్ని సమీక్షించి సానుకూల భావాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఈ సంఘాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణకు డిమాండ్

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : రంగన్నగూడెంలోని నేతాజీ ప్రాథమిక సహకార సంఘానికి దాతలు విరాళంగా ఇచ్చిన నగదు దుర్వినియోగం జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని రాష్ట్ర నీటి సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. తమకు తెలిసిన సమాచారం ప్రకారమే రూ.7.7 లక్షలు పక్కదారి పట్టాయని ఆయన ఆరోపించారు. సోమవారం సహకార సంఘం సర్వసభ్య సమావేశం పర్సన్ ఇన్‌ఛార్జి హరినాథ్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. సహకార సంఘాల ద్వారా విదేశీ విద్యా రుణాలు మంజూరు చేయాలని గోపాలకృష్ణ విజ్ఞప్తి చేశారు. సింగన్నగూడెం పరిధిలో 50 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాం నిర్మించాలని, సహకార భవనానికి దాత ఆళ్ల రామయ్య పేరు పెట్టాలని కోరారు. సర్పంచి కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ సభ్యుడు పుసులూరి లక్ష్మీనారాయణ, ఉపసర్పంచి బెజవాడ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆళ్ల గోపాలకృష్ణ


మద్దూరు పుష్కరఘాట్‌లోని శివమందిరం చుట్టూ మట్టి, వ్యర్థాలు


వరద నీటి ముంపులో కాసరనేనివారిపాలెం శివాలయం (ఇటీవలి చిత్రం)

దేవాలయాల శుభ్రంపై కసరత్తు

మద్దూరు/కాసరనేనివారిపాలెం (కంకిపాడు), న్యూస్‌టుడే: కృష్ణా నదికి వరద వచ్చిన ప్రతిసారీ మద్దూరు, కాసరనేనివారిపాలెం ఒడ్డున ఉన్న పుష్కర ఘాట్‌లు వ్యర్థాలు, మట్టితో నిండిపోతున్నాయి. టన్నుల కొద్దీ గుర్రపు డెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలు మేట వేయడంతో శుభ్రం చేయడానికి జేసీబీలు వాడాల్సి వస్తోంది. ఈ రెండు చోట్ల దసరా ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈలోగానే ప్రక్షాళన పనులు చేపట్టడానికి గ్రామస్థులు కసరత్తు చేస్తున్నారు. విశాలమైన ఎన్టీఆర్ పుష్కర ఘాట్, శివమందిరం, భజన మండపం, మంచినీటి ట్యాంకు, జనరేటర్ తదితరాలను బాగు చేయడానికి రూ.2లక్షల వరకు అవుతుందని అంచనా వేస్తున్నారు. కాసరనేనివారిపాలెం గ్రామస్థులు శ్రమదానం, సహకారంతో ఆలయాన్ని పరిశుభ్రం చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

ముంపు బాధితులకు నెస్లే కిట్ల పంపిణీ

పెనమలూరు, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెనమలూరు పేరంటాళ్లమ్మ చెరువు ఆక్రమణలో ఉన్న నివాసాలు పూర్తిగా మునిగిపోవడంతో ముంపు బాధితులకు నెస్లే సంస్థ అందజేసిన కిట్లను తెదేపా, రెవెన్యూ అధికారులు సోమవారం అందజేశారు. తెదేపా నేతలు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్, తెదేపా నేతలు శ్రీనివాసరావు, బుజ్జి, ప్రసాద్, ఉదయభాస్కర్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు


చెరువు ముంపు బాధితులకు నెస్లే సంస్థ కిట్లను అందజేస్తున్న తెదేపా నేతలు ధనకోటేశ్వరరావు, ఆనంద్

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

కంకిపాడు, న్యూస్‌టుడే: కంకిపాడు లయన్స్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు వరద బాధితులకు బాసటగా నిలిచారు. సోమవారం వారు సేకరించిన రూ.50,670 చెక్కు రూపంలో సంఘం జిల్లా గవర్నర్ గద్దె శేషగిరికి అందజేసినట్లు సంఘ అధ్యక్షుడు శివరామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. సంఘం ప్రతినిధులు మద్దుల గోవిందరావు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు

తాగునీటి సమస్యకు పరిష్కారం

స్పందనకు వందనం

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : బాపులపాడులో తాగునీటి ఎద్దడికి ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ధర్మకోనేరు, రైల్వేస్టేషన్ రక్షిత తాగునీటి పథకాలకు అనుసంధానంగా ఉన్న మోటార్లు నెల కిందట మరమ్మతులకు గురయ్యాయి. దీనిపై 'బాపులపాడులో తీవ్ర తాగునీటి ఎద్దడి' శీర్షికన గత నెల 15న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన సర్పంచి సరిపల్లి కమలబాయి, ఈవో సీహెచ్.ప్రసాద్, ఉప సర్పంచి దుట్టా శివనారాయణ ఇటీవల రైల్వేస్టేషన్ వద్ద కొత్త మోటారు ఏర్పాటు చేయగా, ధర్మకోనేరు చెరువు వద్ద రక్షిత పథకానికి సోమవారం నూతన మోటారు అమర్చి, నీరు విడుదల చేశారు.

వెలుగు ఏపీఎంకు సత్కారం

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : వెలుగు ఏపీఎంగా పని చేసి ఇటీవలే ఉంగుటూరుకు బదిలీ అయిన భూపతిరావు దంపతులకు సోమవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వీడ్కోలు అభినందన సభ నిర్వహించారు. కార్యాలయ సిబ్బంది, పలువురు వీఓఏలు భూపతిరావు దంపతుల్ని సత్కరించారు.

టెట్ కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ

తాడిగడప (కానూరు), న్యూస్‌టుడే: ఈ నెల 3 నుంచి టెట్ నిర్వహించే కేంద్రాన్ని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు పరిశీలించారు. సోమవారం వందడుగుల రోడ్డులోని ఐయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి అక్కడ చేపట్టిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రంలో వెయ్యి మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాస్, విద్యాశాఖాధికారులతో కలసి భద్రతా ఏర్పాట్లు గురించి చర్చించారు.


ఐయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ గంగాధరరావు, డీఎస్పీ చలసాని శ్రీనివాస్ తదితరులు

ఉయ్యూరు సర్కిల్‌లో రూరల్ ఠాణాను కలపాలి

గండిగుంట (ఉయ్యూరుగ్రామీణం): గండిగుంట శివారు కాకానినగర్ సమీపంలో అసంపూర్తిగా నిలిచిన ఉయ్యూరు రూరల్ పోలీస్‌స్టేషన్, సీఐ కార్యాలయ భవనాన్ని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు పరిశీలించారు. సమాచారం అందుకున్న జబర్లపూడి, సాయిపురం గ్రామ సర్పంచులు సూరపనేని శేషవరప్రసాద్, జాన్‌బాషా, మండల తెదేపా అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు ఎస్పీని కలిశారు. ఉయ్యూరు రూరల్ పోలీస్‌స్టేషన్ కంకిపాడు సర్కిల్ పరిధిలో ఉండడంతో దూరమవుతుందని, ఉయ్యూరు సర్కిల్‌లో కలపాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా నిర్ణయం తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు.

అక్రమంగా రవాణా చేస్తున్న మద్యం స్వాధీనం

అయినవిల్లి, న్యూస్‌టుడే: డాక్టర్‌బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా యానం నుంచి అక్రమంగా కృష్ణా జిల్లాకు రవాణా చేస్తున్న వాహనాన్ని పట్టుకుని 192 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్న సంఘటన మండలంలోని మడుపల్లి గ్రామంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. అంబాజీపేట సీఐ భీమరాజు తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్‌కు చెందిన నలుగురు వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత యానం నుంచి కారులో మద్యం సీసాలు కృష్ణజిల్లాకు అక్రమంగా తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు. సమాచారం అయినవిల్లి పోలీసులకు తెలియడంతో మడుపల్లిలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు రూ.52,880 విలువగల 192 మద్యం సీసాలు, వాహనాన్ని అదుపులోకి తీసుకుని నలుగురు వ్యక్తులపై కేసునమోదు చేసినట్లు తెలిపారు.

అందిన సాయం.. ఎంతో ఆనందం

బ్యాంకు ఖాతాల్లో రూ.1.64కోట్లు జమ

న్యూస్‌టుడే, కంకిపాడు, యనమలకుదురు(పెనమలూరు)

కంకిపాడు మండలంలో ముంపునకు గురైన గృహాలకు ప్రభుత్వ సాయం రూ.1.64కోట్లు లబ్ధిదారుల ఖాతాలో జమ అవ్వడంతో వారిలో హర్షం వ్యక్తమవుతోంది. 50 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా బుడమేరు వరద ప్రవాహం గ్రామాలపై ఒక్కసారిగా విరుచుకుపడింది. ఇళ్లల్లోని సామగ్రిని కూడా బయటకు తెచ్చుకోలేని దుస్థితి ఎదురైంది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో పది రోజుల పాటు నీరు నిలిచి ఇంట్లో అన్ని వస్తువులు పూర్తిగా పాడయ్యాయి. నిరాశ్రయులకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు కొంతమేర సాయం చేశాయి. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఒక్కో ఇంటికి రూ.10వేల చొప్పున అందజేయడంతో బాధితుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

యనమలకుదురు, పెదపులిపాకలో ఇలా..

కృష్ణమ్మకు వచ్చిన వరద తో యనమలకుదురు, పెదపులిపాకలో వరద ముంపునకు మొత్తం 3030 కుటుంబాలు ఇబ్బంది పడ్డాయి. వారిలో 2610 మంది బాధితుల బ్యాంకు ఖాతాలకు రూ.2.61 కోట్ల పరిహారం మొత్తం జమయింది. ఇంత స్వల్ప సమయంలో ప్రభుత్వం నుంచి పరిహారం జమకావడంతో బాధితులు కృతజ్ఞతాభావం వ్యక్తం చేస్తున్నారు. మరో 420 మంది బాధితుల బ్యాంకు ఖాతాలకు వారి ఆధార్ లింక్ అయి ఉండకపోవడంతో వారి ఖాతాలకు పరిహారం అందలేదు.

కంకిపాడు మండలంలో ముంపునకు గురైన నివాసాలు

మంతెన	525
ఉప్పలూరు	365
తెన్నేరు	725
గొడవర్రు	29
మొత్తం	1644


బురదతో నిండిన పెదపులిపాకలోని ఓ కాలనీ

ఇల్లు బాగుకు ఉపయోగపడింది



వరదతో ఇల్లు, సామగ్రి పూర్తిగా పాడైంది. ఏం చేయాలో అర్థం కాలేదు. ఈ సమయంలో ప్రభుత్వ సాయం రూ.10 వేలు అందడంతో బాగు చేసుకునేందుకు ఉపయోగపడింది. **- కొండవీటి నాంచారయ్య, తెన్నేరు**

తెన్నేరులోనే 725 మందికి వచ్చింది



బుడమేరు ముంపు ప్రభావం అధికంగా ఉన్న తెన్నేరులో 725 మందికి ఆర్థిక సాయం అందింది. సర్వేలో కులమత రాజకీయాలకు అతీతంగా వివరాల నమోదు జరిగింది. గతంలో ఎన్నడూ ఇంత త్వరగా ఆదుకున్న సందర్భాలు లేవు. వచ్చిన రూ.10వేలతో ఇల్లు బాగు చేయించి నిత్యావసరాలు కొనుగోలు చేసుకున్నాను. **-కె.వెంకటేశ్వరరావు, తెన్నేరు**

మరమ్మతులకు శిబిరం పెట్టాలి



గ్యాస్ పొయ్యిలు, టీవీలు తదితర నిత్యావసర పరికరాలు పాడయ్యాయి. విజయవాడలో లాగా మూడు గ్రామాలకు కలిపి ఒక మరమ్మతుల శిబిరం ఏర్పాటు చేయడం ద్వారా పేదలకు ఉపయుక్తంగా ఉంటుంది. **-వెంకటేశ్వరమ్మ, మంతెన**

సబ్ రిజిస్ట్రార్‌గా జయరాజు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : కానుమోలు నూతన సబ్ రిజిస్ట్రార్‌గా జయరాజు బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఆత్రేయపురం నుంచి ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు పని చేసిన ఎం.వెంకటేశ్వరరావు కంకిపాడుకు బదిలీ అయ్యారు.

సేవలోనే సంతృప్తి

గన్నవరం గ్రామీణం,: సేవలోనే సంతృప్తి దాగి ఉందని పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి డాక్టర్ ప్రణీత్ తెలిపారు. కళాశాల, నెహ్రూ యువ జన కేంద్రం విజయవాడ ఆధ్వర్యంలో మై భారత్.. మేరా యువ భారత్‌లో భాగంగా సోమవారం విద్యార్థులకు ఆసుపత్రి సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతినిధులు ఎస్.రాము, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

3 నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు



గణపేశ్వరంలోని దుర్గాదేవి అమ్మవారు



ముస్తాబైన వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయం

నాగాయలంక, న్యూస్‌టుడే: ఈ నెల 3 నుంచి 12 వరకు గణపేశ్వరంలోని దుర్గా గణపేశ్వరస్వామి ఆలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త మండ శ్రీరామచంద్ర మూర్తి, కార్యనిర్వహణాధికారి సీహెచ్ సుధాకర్‌రావు తెలిపారు. ★ స్థానిక కృష్ణా నది తీరాన వెలిసిన రామపాద క్షేత్రంలోని దుర్గాదేవి ఆలయంలోని 35వ వార్షిక శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు తెలిపారు. ★ స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని ఈ నెల 12న ముగుస్తాయని ఆలయ కమిటీ ఛైర్మన్ చిట్టా సాంబశివరావు తెలిపారు.

రైతులకు అందుబాటులోకి పొటాష్

పమిడిముక్కల, న్యూస్‌టుడే: పొటాష్ ఎరువు రైతులకు అందుబాటులోకి వచ్చిందని మండల వ్యవసాయాధికారి ఎన్. గణేష్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఇటీవల ఈ ఎరువు పలు సహకార సంఘాలల్లో లభించక రైతులు తీవ్ర అసౌకర్యానికి గురైన విషయం విదితమే. ఆ శాఖ సహాయ సంచాలకుల చొరవతో మండలానికి మొత్తం 45 టన్నుల ఎరువు వివిధ సంఘాలకు చేరిందని, వాటిలో గోపువానిపాలెం 5, పమిడిముక్కల, అగినపర్రు, కపిలేశ్వరపురం, అమీనపురం సంఘాలకు 10 మెట్రిక్ టన్నుల చొప్పున వచ్చిందన్నారు. రైతులు సంఘ గోదాముల నుంచి 50 కిలోల సంచి ఒక్కింటికి రూ. 1550 చెల్లించి తీసుకువచ్చని, అవసరమైతే మరికొంత సరకు వచ్చే అవకాశం ఉందని గణేష్‌రెడ్డి తెలిపారు.

లక్షలు వెచ్చించారు.. లక్ష్యం మరిచారు

న్యూస్‌టుడే, నాగాయలంక, గుడివాడ గ్రామీణం, మోపిదేవి

రైతు భరోసా కేంద్రాలు(ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు).. రైతులకు గ్రామస్థాయిలో సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో రూ.కోట్లు వెచ్చించి వీటిని ఏర్పాటు చేశారు. విత్తు నుంచి పంట కోత వరకు నూతన సాంకేతిక పరిజ్ఞానం సాయంతో అన్నదాతలకు అవగాహన కల్పించేందుకు అవసరమైన వసతులు కల్పించారు. గత వైకాపా ప్రభుత్వ అయిదేళ్ల పాలనలో పర్యవేక్షణ లేక, నిర్వహణ కొరవడి వాటి లక్ష్యం నెరవేరలేదు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసేందుకు తెచ్చిన కియోస్క్‌లు మూలకు చేరాయి. టీవీలు నిరుపయోగంగా మిగిలాయి. దీంతో ప్రజాధనం వృథా అయిందని.. కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

★★ వైకాపా పాలనలో అవనిగడ్డ నియోజకవర్గంలో 77 రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఒక్కో కేంద్రానికి రూ. 30 వేల విలువైన టీవీ, రూ. 62 వేల విలువైన కియోస్క్ సమకూర్చింది.

★★ పంట దిగుబడులు, ఆశించే పురుగులు, తెగుళ్లపై వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు నిర్వహించే ముఖాముఖి కార్యక్రమాలు, సభలు, సమావేశాలు ప్రత్యక్షంగా రైతుల్లో చైతన్యపరచడానికి ఏర్పాటు చేసిన టీవీలు గోడలకే పరిమితమయ్యాయి. నిర్వహణ ఖర్చుల కోసం అధికారుల నుంచి సహకారం లేకపోవడంతో పక్కన పెట్టారు.



నాగాయలంకలో నిరుపయోగంగా కియోస్క్, టీవీ

★★ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విక్రయాల కోసం రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన కియోస్క్‌లు కొన్ని రోజులు పని చేసినా చాలా కేంద్రాల్లో వృథాగా ఉన్నాయి. కొన్ని చోట్ల సాంకేతిక సమస్యలు తలెత్తడంతో సిబ్బంది పరిష్కరించలేక వదిలేశారు.

★★ నియోజకవర్గంలో 77 కేంద్రాల కోసం సొంత భవనాల నిర్మాణం చేపట్టి ఇప్పటి వరకు 5 మాత్రమే ప్రారంభించారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. వాటిని కూడా పూర్తిచేసి నిర్దేశించిన సేవల్ని అందుబాటులోకి తేవాలని అన్నదాతలు కోరుతున్నారు.

అలంకార ప్రాయం

రైతు సేవా కేంద్రాలకు వైఫై, అంతర్జాల సౌకర్యాలు లేవు. ఏపీ ఫైబర్‌నెట్ కనెక్షన్ తీసుకున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఎక్కడా కానరావడం లేదు. కొన్ని చోట్ల గ్రామీణ వ్యవసాయ సహాయకులు చరవాణి హాట్‌స్పాట్ ద్వారా కియోస్క్‌లను నిర్వహిస్తున్నారు. గుడివాడ మండలంలో 12, పట్టణంలోని నాగవరప్పాడు, బేతవోలులో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాలు అలంకారప్రాయంగా మిగిలాయి. వీటికన్నా వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో పలు సేవలు అందిస్తున్నాయని రైతులు చెబుతున్నారు.

నామ ఫలకాలు మార్చేదెప్పుడు?



రైతు భరోసా కేంద్రాల పేరుని కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. ఈ మేరకు పాత పేరుతో తొలగించి కొత్త పేరుతో నామ ఫలకాలు ఏర్పాటు చేయాలని పేర్కొంది. కానీ క్షేత్రస్థాయిలో ఇంకా అమలుకు నోచుకోలేదు. ప్రభుత్వం మారినా అధికారుల తీరు మారలేదంటూ ఆయా కేంద్రాలకు వస్తున్న రైతులు పేర్కొంటున్నారు. దీనిపై మోపిదేవి ఏవో హెప్సిబారాణి వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా భవనాలకు రంగులు వేయడం, పేర్లు రాయడానికి నివేదించామని.. నిధులు మంజూరు కాగానే పేర్లను మారుస్తామన్నారు.

సొసైటీ అభివృద్ధికి తోడ్పడాలి

ఘంటసాల, న్యూస్‌టుడే: సంఘ సభ్యులు, రైతులు పీఏసీఎస్‌లో డిపాజిట్లు వేసి సొసైటీ అభివృద్ధికి తోడ్పడాలని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బండి పరశురామరావు తెలిపారు. ఘంటసాలలో సోమవారం పీఏసీఎస్ సర్వసభ్య సమావేశాన్ని మచిలీపట్నం సొసైటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వీరస్వామి అధ్యక్షతన నిర్వహించారు. పరశురామరావు మాట్లాడుతూ.. రైతులు సొసైటీలో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే మళ్లీ వెంటనే రుణాలు పొందే అవకాశముందని తెలిపారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ వీరస్వామి మాట్లాడుతూ.. పొటాష్, యూరియా సొసైటీల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. దేవరకోట, ఘంటసాలలో ధాన్యం నిల్వ చేసుకునేందుకు గోడౌన్లు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వేమూరి రత్నశేఖర్, మాజీ ఉప సర్పంచి గొర్రెపాటి గోపాలకృష్ణ, కార్యదర్శి కొణతం రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ద్వారకా తిరుమలకు దోషపరిహార ప్రాయశ్చిత్త సైకిల్ ర్యాలీ

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: లడ్డూ ప్రసాదం కల్తీతో రాష్ట్రంలోని అన్ని ఆలయాలకు శుద్ధి చేసుకుని ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిన గతి పట్టిందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. తెదేపా వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోకవరపు సునీల్ ఆధ్వర్యంలో తెదేపా నాయకులు, ఆర్యవైశ్య సంఘీయులతో స్థానిక వాసవీ చౌక్‌లోని కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి ద్వారకా తిరుమలకు చేపట్టిన భారీ సైకిల్ ర్యాలీని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసాదం కల్తీ వ్యవహారంపై హిందువులు వేదనకు గురయ్యారన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు వాసే మురళి, బూజాసి గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ దావులూరి సురేంద్ర బాబు, తెదేపా నాయకులు కొత్త మురళీకృష్ణ, తిరువీదుల సుబ్బారావు పాల్గొన్నారు.



జెండా ఊపి ప్రారంభిస్తున్న గుడివాడ ఎమ్మెల్యే రాము

కుల రక్కసిపై పోరాటం చేసిన యోధుడు జాషువా



అనిల్‌కుమార్‌కు పురస్కారం అందిస్తున్న దృశ్యం

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: కుల రక్కసిపై కలం పోరాటం చేసిన యోధుడు మహాకవి గుర్రం జాషువా అని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ ఎం.ఎస్.ఎ.దివాకర్ పేర్కొన్నారు. స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో సోమవారం గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాషువా సమాజంలోని రుగ్మతలపై తన రచనల ద్వారా చైతన్యపర్చారన్నారు. పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన సాహితీ వేత్త డి.అనీల్‌కుమార్‌కు గుర్రం జాషువా సాహితీ పురస్కారం 2024ను అందజేశారు. విశ్రాంత అధ్యాపకులు కోగంటి చెన్ను గాంధీ బాబు, చోరగుడి ఇశ్రాయేలు, సమితి సమన్వయకర్త డీఆర్‌బీ.ప్రసాద్, సాహితీ ప్రియులు మోకా మాధవరావు, చోడవరపు రూప, బండి గోవర్ధనరావు, వసుధ భసవేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



చిత్రపటం వద్ద ఆదిమాంధ్ర సంఘం నాయకులు, వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ నివాళులు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: నేటి యువత అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తూ ఉన్నత విద్యావంతులు కావాలని గుడివాడ వన్ టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 1944లో ప్రారంభించిన అలిమేలంబ బాలికల వసతి గృహం స్థానంలో నిర్మించిన అంబేడ్కర్ భవన్‌లో సోమవారం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ 80 ఏళ్ల కిందట అంబేడ్కర్ నడయాడిన ప్రాంతంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేయడం ఆనందంగా ఉందన్నారు. ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు మాట్లాడుతూ దళితులకు రాజ్యాధికారం అంబేడ్కర్ ఆశయమన్నారు. మెండా కిరణ్‌కుమార్, నీలం ప్రభాకర్, సంఘం జిల్లా కార్యదర్శి బొద్దు విల్సన్ బాబు, దారం ఉపేంద్ర, బెజ్జం సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైంది



రావెళ్ల వరుణ్ కుమార్ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

పెదపారుపూడి, న్యూస్‌టుడే: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉత్తమమైందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. ఎంతోమంది మేధావులను తయారు చేసిన ఘనత ఉపాధ్యాయులకే దక్కుతుందన్నారు. విద్యార్థులు కూడా క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించాలన్నారు. సోమవారం నిర్వహించిన యలమర్రు జిల్లా పరిషత్తు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రావెళ్ల వరుణ్ కుమార్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. అనంతరం రావెళ్ల దంపతులను సత్కరించారు. సర్పంచి కొల్లూరి అనూష, ఎంఈవో శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గీతామందిరం ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక గీతా మందిరంలో ఏర్పాటు చేసిన ధ్వజస్తంభానికి దాతల సహకారంతో 300 కిలోల ఇత్తడి తొడుగు ఏర్పాటు చేసినట్లు మందిరం కమిటీ సభ్యులు తెలిపారు. దసరా నవరాత్రులను పురస్కరించుకుని మందిరంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా బాలాజీ



అవనిగడ్డ, న్యూస్‌టుడే: మచిలీపట్నం కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బి. బాలాజీ బదిలీపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో చేరారు. ఆయన గతంలో ఇదే కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించారు.

పీడీ మారుతీకి సన్మానం

ఘంటసాల: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరుకునేందుకు పీడీ మారుతీ కృషి చేస్తున్నారని హెచ్‌ఎం వేణుగోపాలరావు అన్నారు. విజయవాడలో ఆదివారం డీపీఆర్టీయూ ఆధ్వర్యంలో ఏపీ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి ద్వారా ఉత్తమ క్రీడా పురస్కారం అందజేశారు. సోమవారం గోగినేనిపాలెం జడ్పీ పాఠశాలలో పీడీ గరికపాటి మారుతీని ప్రధానోపాధ్యాయులు వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు సత్కరించారు.

పాఠశాల శిలాఫలకం ఆవిష్కరణ



పాఠశాల ప్రారంభిస్తున్న గొర్రెపాటి రంగనాథబాబు తదితరులు

ఘంటసాల, న్యూస్‌టుడే: ఘంటసాలలో రూ. 75 లక్షలతో నిర్మించిన యూవీఆర్ స్కూల్‌ని ఎన్నారై గొర్రెపాటి రంగనాథబాబు సోమవారం ప్రారంభించారు. గొర్రెపాటి ఫౌండేషన్ ద్వారా రంగనాథబాబు చేస్తున్న సేవా కార్యక్రమాలను విజయవాడకు చెందిన దగాని కిరణ్ ఆధ్వర్యంలో 7 నిమిషాల డాక్యుమెంటరీ ప్రదర్శించారు. స్థానిక పీహెచ్‌సీలో మౌలిక వసతుల కల్పనకు చేయూత అందివ్వాలని పలువురు రంగనాథబాబును కోరగా వెంటనే రూ. లక్ష ప్రకటించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకటరామకృష్ణ, గొర్రెపాటి విద్యాట్రస్టు ప్రతినిధి కొండపల్లి రామకృష్ణ, ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు పిశుపాటి వెంకట నరసింహారావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారులకు సత్కారం



కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అఖిలపక్ష నాయకులు

ఘంటసాల న్యూస్‌టుడే: ఘంటసాల మండలం నుంచి బదిలీపై వెళ్తున్న పలువురు మండల అధికారులు, పంచాయతీ అధికారులను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సభ్యురాలు వేమూరి రజినీ కుమారి అధ్యక్షతన పలువురు శాలువాలతో సత్కరించారు. ఈవోపీఆర్డీ గుత్తికొండ కిశోర్, పీఆర్ అండ్ ఏఈ జే నాగేశ్వరరావు, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు శివరామ ప్రసాద్, వి. వెంకటేశ్వరరావు, డి. రమాదేవి, జె. సురేఖ, జూనియర్ అసిస్టెంట్లు చంద్రశేఖర్, డి. పద్మజ తదితరులను సత్కరించారు. జడ్పీటీసీ సభ్యుడు తుమ్మల మురళీకృష్ణ, ఎంపీడీవో డి. సుబ్బారావు, అఖిల పక్ష నాయకులు తుమ్మల చౌదరిబాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, వేమూరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో వ్యాయామోపాధ్యాయులు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక అన్నపరెడ్డి సుబ్బారావు ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన బ్యాండ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు నియోజకవర్గ స్థాయి పోటీల ఇన్‌ఛార్జి కె.పూర్ణ తెలిపారు. నియోజకవర్గంలోని 6 మండలాల నుంచి 120 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఒక్కో కేటగిరీకి ఐదుగురు చొప్పున క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరు త్వరలో జరగనున్న జిల్లా స్థాయి పోటీలకు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. మునగాల ఉదయ్‌కుమార్, సనకా శ్రీకాంత్, అమ్ముల భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి, న్యూస్‌టుడే: జిల్లా స్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ పోటీలకు మోపిదేవి గురుకుల పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు వీరరవి సోమవారం తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారని చెప్పారు. అండర్ 14 విభాగంలో రాముడు, లక్ష్మణుడు, సాయివర్మ, మణికంఠస్వామి, పార్థు, అండర్ 17 విభాగంలో రామ్‌చరణ్, లోకేశ్, ప్రశాంత్, ధర్మతేజ ఎంపికైనట్లు తెలిపారు.

కూటమి శ్రేణుల ప్రత్యేక పూజలు



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న కూటమి నాయకులు, గ్రామస్థులు

మోదుమూడి(అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ తయారీలో గత వైకాపా ప్రభుత్వం కల్తీనెయ్యి వినియోగించి భక్తులకు మనోవేదన కలిగించిందని జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం అవనిగడ్డ మండలం మోదుమూడి ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనారాయణస్వామి, అభయాంజనేయస్వామి, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో కూటమి నేతలు, గ్రామస్థులు ప్రాంగణాలను పసుపు నీళ్లతో శుభ్రం చేసి ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచి బచ్చుబేబి, వెంకటనారాయణ, రఘునాథ్‌లతోపాటు కూటమి నేతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ...

అవనిగడ్డ, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు మేరకు సోమవారం రాత్రి స్థానిక వంతెన కూడలిలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో కూటమి నాయకులు, వీర మహిళలు, తెలుగు మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సతీమణి విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని స్వామి వారికి పూజలు చేసి, దీపాలు వెలిగించారు. మాజీ ఎంపీపీ సభ్యులు బండే కనకదుర్గ, మోర్ల జయలక్ష్మీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.


కిడ్నీ బాధితునికి దాతల చేయూత

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లికి చెందిన అబ్దుల్ సుభాన్ రెండు కిడ్నీలు పాడైపోయి చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో బాధితుడికి వైద్య ఖర్చుల నిమిత్తం హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ ఎహియా రూ. 50వేలు ఆర్థికసాయం అందించారు. సాయాన్ని ఎహియా తండ్రి మహమ్మద్ ఇలియాస్ బాధితుడికి అందజేశారు.

తెదేపా మండలాధ్యక్షుడికి బుద్ధప్రసాద్ పరామర్శ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: తెదేపా మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆయన కారులో బాపట్ల జిల్లా భట్టిప్రోలు అడ్డరోడ్డు నుంచి ప్రధాన రహదారిపైకి వస్తుండగా ఎదురుగా వచ్చిన ఓ ట్రాక్టర్ చిట్టిబాబు వాహనాన్ని ఢీకొట్టింది. కారు నుజ్జు నుజ్జు కాగా, సకాలంలో ఎయిర్ బాగ్స్ తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు హుటాహుటిన ఆయన్ను రేపల్లె ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆయన తనయుడు వెంకట్రామ్ చిట్టిబాబు ఇంటికెళ్లి పరామర్శించారు.

వరద బాధితులకు సాయం



దుస్తులు, దుప్పట్లు అందజేస్తున్న సురేష్, రోజా దంపతులు

చల్లపల్లి, న్యూస్‌టుడే: నిరుపేదలకు సహాయ సహకారాలు అందించే సేవా దృక్పథంగల సంస్థ ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ (ఐవీఎం) అని డైరెక్టర్ వేములపల్లి సురేష్ అన్నారు. సోమవారం బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పెదలంకకు చెందిన 520 మంది వరద బాధిత కుటుంబాలకు రూ. 5.20లక్షలతో చీరలు, దుప్పట్లు, లుంగీలు, టవల్స్‌ను ఐవీఎం సేవాసంస్థ సహకారంతో డైరెక్టర్ వేములపల్లి సురేష్-రోజా దంపతులు అందించారు. సురేష్ మాట్లాడుతూ. . కృష్ణానదికి వచ్చిన వరదల కారణంగా ఎంతోమంది నిరాశ్రయులయ్యారని, వారిని ఐవీఎం ఆదుకుంటోందని తెలిపారు. ఐవీఎం ప్రతినిధులు వి. రోజా, విజయ, దైవ సేవకులు జాన్‌పాల్ పాల్గొన్నారు.

రహదారి గుంతలు పూడ్చుకున్న గ్రామస్థులు



కూచిపూడి, న్యూస్‌టుడే: మొవ్వ మండలం కూచిపూడిలోని బార్లపూడి రోడ్డులో సిద్ధేంద్రయోగి నాట్య కళాపీఠం ప్రాంతంలో పడిన గోతులను సోమవారం గ్రామస్థుల సహకారంతో పూడ్చుకుంటున్నారు. కంకరతో గుంతలు పూడుస్తూ అభివృద్ధి చేస్తున్నారు. ఇటీవల ఈప్రాంతంలో ఒక వృద్ధుడు సైకిల్‌పై వెళ్తూ గుంతలో పడి గాయపడి 15రోజుల అనంతరం మరణించాడు. తరచూ ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో తెదేపా నాయకులతోపాటు పలువురు గ్రామస్థులు అందించిన విరాళాలు దాదాపు రూ. 70 వేలతో గుంతల్ని పూడ్చుతున్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



ప్రమాణం చేస్తున్న కార్యవర్గం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్వర్ణోత్సవ మహాసభలో మండలశాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు బి. కనకారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడిగా కూనపరెడ్డి జీవేంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా బండ్రెడ్డి శివరామకృష్ణ ఎన్నికయ్యారు.


స్థలం కబ్జా చేసి వైకాపా నేతలు రోడ్డు వేశారు

న్యాయం చేయాలని 'ప్రజా దర్బార్'లో మంత్రి నారా లోకేశ్‌కు విన్నపం

తాడేపల్లి, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో తన స్థలాన్ని కబ్జా చేసి రాత్రికి రాత్రే రోడ్డు నిర్మించారని అవనిగడ్డకు చెందిన వెంకటేశ్వరరావు గుంటూరు జిల్లా ఉండవల్లి నివాసంలో సోమవారం జరిగిన 'ప్రజా దర్బార్'లో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. పాత రహదారిని పునరుద్ధరించి అన్యాక్రాంతం చేసిన తన భూమిని ఇప్పించాలని ఇందుకు కారకులైన వైకాపా నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ★ ఏలేరు కాలువ ఆధునీకరణ కోసం ఆరేళ్ల క్రితం సేకరించిన తమ 60 సెంట్ల వ్యవసాయ భూమికి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన పెండ్యాల అమ్మన్న, తాను స్థాపించిన మాతృధరణి ప్రాజెక్టు ప్రయివేటు లిమిటెడ్ కంపెనీని స్వాధీనం చేసుకునేందుకు మంగళగిరి మండలం కాజకు చెందిన ఒంటెద్దు వెంకటేశ్వరరావు, కోటా మురళీకృష్ణ ప్రయత్నిస్తున్నారని, తనకు ప్రాణహాని ఉందని ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం ముడివేములకు చెందిన రామినేని సురేష్‌బాబు ఫిర్యాదు చేశారు. ఇటీవల వరదల్లో తమ పాడి పశువులు గల్లంతయ్యాయని నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన రైతులు మంత్రికి విన్నవించారు.

ఆటో చోరీ.. గంటన్నరలో ఛేదించిన పోలీసులు

కూచిపూడి, న్యూస్‌టుడే: కూచిపూడి - మొవ్వ గ్రామల మధ్య ప్రధాన రహదారిపై ఉంచిన ఆటోను పొలానికి వెళ్లొచ్చేలోపు చోరీకి గురైందని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని కూచిపూడి ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. అయ్యంకి గ్రామానికి చెందిన పడమటి నాగరాజు ఆటో నడుపుకుంటూ, పొలం పనులు చేసుకొని జీవిస్తున్నాడు. సోమవారం కూచిపూడి - మొవ్వ గ్రామాల మధ్యన గల తన కౌలు పొలానికి మందు పిచికారీ చేసి తిరిగి రాగా రోడ్డు పక్కన పెట్టిన ఆటో కనిపించలేదు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పామర్రు సీఐ సుభాకర్ పర్యవేక్షణలో ఎస్ఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక సమాచారంతో పామర్రుకు చెందిన గండ్రెడ్డి శివ అనే వ్యక్తి ఆటో దొంగతనం చేశాడని తెలుసుకున్నారు. వెంటనే అతడ్ని అదుపులోకి తీసుకొని గంటన్నరలో ఆటో రికవరీ చేశారు.


ముఖ్యమంత్రి చంద్రబాబుకు విరాళం అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఈవో, ఎండీ మణిమేఖలై, ఆ బ్యాంకు అధికారులు ★ సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్, టెక్నికల్ ఎడ్యుకేషన్ అధ్యక్షుడు డాక్టర్ సి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు రాజయ్య, కార్యదర్శి పి.లక్ష్మణరావు ★ ఆర్జా స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ శ్రీధర్ కృష్ణమూర్తి. చిత్రంలో బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ తదితరులు

వరద బాధితులకు అండ

- సీఎం సహాయనిధికి పలువురు విరాళాలు

ఈనాడు డిజిటల్, అమరావతి, న్యూస్‌టుడే యంత్రాంగం: ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు పలువురు వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు వరద బాధితుల్ని ఆదుకోవడానికి ముందుకొస్తున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్)కి విరాళాలు అందిస్తున్నారు. సోమవారం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లను పలువురు కలిసి విరాళాల చెక్కుల్ని అందజేశారు.

యూనియన్ బ్యాంకు ఉద్యోగుల ఒకరోజు వేతనం

వరద బాధితుల సహాయార్థం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు తమ ఒకరోజు వేతనం రూ.5,90,01,087ను విరాళంగా ప్రకటించారు. ఇందుకు సంబంధించిన చెక్కును సీఈవో, ఎండీ ఎ.మణిమేఖలై సీఎం చంద్రబాబుకు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు ప్రతినిధులు ఎస్.రామసుబ్రహ్మణియన్, సీవీఎన్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

✦ సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్, టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సి.నాగేశ్వరావు, వైస్ ప్రెసిడెంట్ ఎం.రాజయ్య, కార్యదర్శి పి.లక్ష్మణరావు రూ. కోటి విరాళం ప్రకటించారు. ఈ మేరకు చెక్కును చంద్రబాబుకు అందజేశారు.

✦ ఆర్జా స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ శ్రీధర్‌కృష్ణమూర్తి రూ.కోటి అందజేశారు. విరాళానికి సంబంధించిన చెక్కును ముఖ్యమంత్రికి ఇచ్చారు.

✦ కేరళకు చెందిన పెన్వర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఎండీ ఫిలిప్స్ థామస్ రూ.50 లక్షల చెక్కును మంత్రి లోకేశ్‌కు ఇచ్చారు.




మంత్రి లోకేశ్‌కు విరాళం అందజేస్తున్న పెన్వర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఎండీ ఫిలిప్స్ థామస్ తదితరులు ★ శశివిద్యా సంస్థల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ తదితరులు

✦ విజయవాడకు చెందిన ఇండిపెండెంట్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (ఐసీఎంఏ) ప్రతినిధులు రూ.50 లక్షల విరాళం ఇచ్చారు. ఈ మేరకు చెక్కును మంత్రి లోకేశ్‌కు అందజేశారు.


✦ బెంగళూరుకు చెందిన తెలుగు విజ్ఞాన సమితి ప్రతినిధులు ఎ.రాధాకృష్ణరాజు, ఆర్.ఆదికేశవులునాయుడు రూ.25 లక్షల చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేశారు.

✦ శశి విద్యా సంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.25 లక్షల విరాళమిచ్చారు. ఈ మేరకు మంత్రి లోకేశ్‌కు చెక్కు అందజేశారు. ఆ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ మాట్లాడుతూ తమ విద్యాసంస్థల తరఫున గతంలో రూ. కోటి విరాళం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు, విద్యార్థుల సహకారంతో మరో రూ.25 లక్షలు అందించడం సంతోషకరమన్నారు.

వ్యక్తి/సంస్థ	సాయం (రూ.లలో)
అసోసియేషన్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా	10 లక్షలు
ఎం.అప్పారావు	10 లక్షలు
చిన్మయ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్	10 లక్షలు

✦ అనంతపురానికి చెందిన కేఎం షకీల్ షఫి నేతృత్వంలో ఏపీ వక్ఫ్ ఇన్‌స్టిట్యూషన్స్, ముతావల్లీస్ అండ్ మేనేజింగ్ కమిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.7.86 లక్షల విరాళం అందించారు.

✦ జంపాల భావనారాయణ, శారద అనే వృద్ధులు రూ.లక్ష చెక్కు, 16 గ్రాముల బంగారు బ్రేస్‌లెట్‌ని వరద బాధితులకు విరాళంగా ముఖ్యమంత్రికి అందజేసి తమ ఉదారత చాటుకున్నారు.



ముఖ్యమంత్రికి విరాళం ఇస్తున్న బెంగళూరుకు చెందిన తెలుగు విజ్ఞాన సమితి ప్రతినిధులు ఎ.రాధాకృష్ణరాజు, ఆర్.ఆదికేశవులునాయుడు తదితరులు



ముఖ్యమంత్రికి విరాళం చెక్కు, 16 గ్రాముల బంగారం అందిస్తున్న వృద్ధులు జంపాల భావనారాయణ, శారద. చిత్రంలో మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి

✦ తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం అచ్చెన్నపాలెంకు చెందిన పాతూరి కేతన్‌చౌదరి అనే బాలుడు తన కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.10 వేల విరాళాన్ని సీఎంకు అందజేశాడు.



ఎగువ, దిగువ కాఫర్‌డ్యాం మధ్య నీటిని ఎత్తిపోసేందుకు ఏర్పాటు చేసిన పంపులు

పోలవరానికి తగ్గిన వరద

డయాఫ్రంవాల్ నిర్మాణ ప్రాంతంలో నీరు ఎత్తిపోతకు చర్యలు

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన డయాఫ్రంవాల్ నిర్మాణం నవంబరు నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. గోదావరిలో వరద ఉద్ధృతి తగ్గడంతో ప్రధాన డ్యాం ప్రాంతంలోని నీటిని పంపుల ద్వారా బయటకు ఎత్తిపోస్తుండగా.. తాజాగా మరిన్ని పంపులు ఏర్పాటు చేసే పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. దిగువ కాఫర్‌డ్యాం వద్ద సోమవారం నాటికి గుత్తేదారు సంస్థ 23 పంపులు ఏర్పాటు చేసి, నీటిని గోదావరిలోకి మళ్లిస్తున్నారు. సుమారు వంద పంపులు ఏర్పాటు చేయాలని నెల రోజుల కిందటే జలవనరుల శాఖాధికారులు గుత్తేదారు సంస్థకు ప్రణాళిక అందజేశారు. మొన్నటి వరకు రెండు కాఫర్‌డ్యాంల మధ్యనున్న నీరు డీస్లింటింగ్ స్లూయిస్ నుంచి నదిలోకి వెళ్లేది. స్లూయిస్ నుంచి నీరు ఆశించిన మేర బయటకు వెళ్లకపోవడంతో పంపులు ద్వారా తోడేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ నెలలో విదేశీ నిపుణుల బృందం మరోసారి ప్రాజెక్టు సందర్శనకు రానుంది. ఈలోపు నీరంతా తోడించి, వారు సమగ్రంగా డయాఫ్రంవాల్ ప్రదేశాన్ని చూసేలా సర్వం సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఎమ్మెల్యే కొలికపూడిని సస్పెండ్ చేయాలి

ప్రధాన రహదారిపై మహిళల నిరసన



తిరువూరు మండలం చిట్టేలలో నినాదాలు చేస్తున్న మహిళలు

తిరువూరు, న్యూస్‌టుడే: మహిళా ఉద్యోగుల వాట్సాప్ నంబర్లకు అసభ్యకరంగా సందేశాలు పంపిస్తూ లైంగికంగా వేధిస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును తెదేపా అధిష్ఠానం సస్పెండ్ చేయాలని మహిళలు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలంలోని చిట్టేలలో సోమవారం మహిళలు ప్రధాన రహదారిపై నిరసన ప్రదర్శన నిర్వహించారు. మహిళల పట్ల ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయని మండిపడ్డారు. ఎమ్మెల్యే నుంచి రక్షణ కల్పించాలని కోరారు. కొలికపూడిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమం తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

నిజం నిగ్గు తేల్చాలంటున్న ఎమ్మెల్యే: తనపై చేసిన ఆరోపణలు నిజమైతే అరెస్టు చేసి శిక్షించాలని, లేని పక్షంలో ఆరోపణలు చేసిన వారిని శిక్షించాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమవారం రాత్రి నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై ఆరోపణలు చేస్తున్న మహిళ ఇప్పటివరకు నాలుగుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించారని, ఆమె భర్తపై పోలీసులు ఎప్పుడు కేసు పెట్టినా ఇలాంటి ఆత్మహత్య నాటకం ఆడుతారని ఆరోపించారు. తనపై పథకం ప్రకారం చేస్తున్న అసత్య ప్రచారాన్ని నియోజకవర్గ ప్రజలు నమ్మబోరని అన్నారు. అధిష్ఠానం ఆదేశాలతో తన దీక్షను విరమిస్తున్నానని ప్రకటించారు.

'జగనన్న తోడు' పథకం పేరు మార్పు

ఈనాడు, అమరావతి: చిరు వ్యాపారుల కోసం ప్రవేశపెట్టిన 'జగనన్న తోడు' పథకం పేరును కూటమి ప్రభుత్వం మార్చింది. ఆ పథకానికి 'చిరు వ్యాపారులకు సున్నా వడ్డీ రుణాలు'గా పేరు పెట్టింది. జగనన్న తోడు పథకం పేరు మార్పు కోసం గ్రామ, వార్డు సచివాలయాల శాఖ నుంచి వచ్చిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

నిర్మలా సీతారామన్ మీద విచారణపై కర్ణాటక హైకోర్టు స్టే



ఈనాడు, బెంగళూరు: ఎన్నికల బాండ్ల సేకరణలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మీద విచారణపై కర్ణాటక హైకోర్టు స్టే విధించింది. తదుపరి విచారణను అక్టోబరు 22వ తేదీకి వాయిదా వేసింది. సోమవారం జస్టిస్ ఎం.నాగప్రసన్న నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు ఇస్తూ.. ప్రతివాదుల నుంచి అభ్యంతరాలు దాఖలయ్యేంత వరకు ప్రాథమిక విచారణ చేపట్టటం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. తదుపరి విచారణ వరకు ఈ స్టే అమలులో ఉంటుందన్నారు. ఐపీసీ సెక్షన్లలో బాధితులకు రక్షణ కల్పించే విధానాలున్నాయని, ఈ కేసులో ఫిర్యాదుదారుడు ఎలాంటి బాధితుడూ కాదని వివరించారు. కేవలం ఈ ఫిర్యాదు ద్వారా ఐపీసీ సెక్షన్ 383 వినియోగం గురించి వెల్లడించాలన్న అభిప్రాయంతో ఉన్నారని పేర్కొన్నారు. ఈ కేసులో మరో నిందితుడు, భాజపా కర్ణాటక శాఖ పూర్వ అధ్యక్షుడు నళిన్ కుమార్ కటీల్.. తనపై కేసు నమోదు చేయవద్దంటూ వేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి విచారణ చేపట్టారు. జనాధికార సంఘ్ పరిషత్ సహాధ్యక్షుడు ఆదర్శ్ అయ్యర్ చేసిన ఫిర్యాదు మేరకు గత శుక్రవారం ప్రత్యేక కోర్టు విచారణకు ఆదేశించింది. శనివారం బెంగళూరులోని తిలక్‌నగర్ పోలీసులు నిర్మలా సీతారామన్‌తో పాటు భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర తదితరులపై కేసు నమోదు చేశారు.

అతిథులొస్తున్నారు..!

రోజూ వారీ బస్సులు :	మూడు వేలు
ప్రయాణికులు :	1.50 లక్షల మంది
పండగ వేళ :	సుమారు 40వేలు (అదనం)

✦ నగరంలో నవరాత్రులు..

✦ బస్‌స్టేషన్లో వసతులపై దృష్టి అవసరం

విజయవాడ బస్టేషన్, న్యూస్‌టుడే

దేశంలో అతి పెద్ద బస్‌స్టేషన్లలో విజయవాడ ఒకటి. నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రయాణికులతో కిటికిటలాడుతుంది. ఒకవైపు వచ్చే బస్సులు వస్తుంటే.. మరో వైపు వెళుతూనే ఉంటాయి. పండగలు పబ్బాలు, సెలవులు వచ్చాయంటే.. రాకపోకలు రెట్టింపవుతాయి. దసరా ఉత్సవాల నేపథ్యంలో నగరానికి వచ్చే భక్తులకు బస్‌స్టేషన్‌లో వసతులు మెరుగుపరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వినోదానికి తెర

బస్టేషన్‌లోని సమాచార కేంద్రం ఎదురుగా బిగ్ స్క్రీన్ (తెర) ఏర్పాటు చేశారు. సినిమాలు, పాటలు, క్రికెట్ మ్యాచ్‌లు ప్రసారం చేసేవారు. వేచి ఉండే ప్రయాణికులకు వినోదం లభించేది. ప్రస్తుతం ఇది మరమ్మతులకు గురైంది. దీనిని అందుబాటులోకి తీసుకొస్తే.. నవరాత్రులకు వచ్చే వారికి ప్రయోజనకరంగా ఉంటుంది.



పని చేయని బిగ్ స్క్రీన్

పోలీస్ పర్యవేక్షణ పెరగాలి

సాధారణంగానే బస్‌స్టేషన్‌లో జేబు దొంగలు తిరుగుతున్నారు. దసరా నేపథ్యంలో వారు చేతివాటం చూపే అవకాశాలు లేకపోలేదు. రైల్వే గేటు నుంచి బ్లేడ్ బ్యాచ్ వస్తోంది. పోలీసులు సైతం పట్టించుకోవడం మానేశారు. ఇప్పుడైనా నిఘా పెంచి దుండగుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి.

నిర్వహణ మరిచి..

బస్‌స్టేషన్‌లోని ఇన్‌గేట్ వైపు, అరైవల్ బ్లాక్‌వైపు, డిపాశ్చర్ బ్లాక్ ఎదురుగా, సిటీ బస్‌పోర్ట్‌లో ఉచిత మూత్రశాలలు ఉన్నాయి. వీటి నిర్వహణను గాలికొదిలేశారు. అరైవల్‌బ్లాక్ వద్ద రేకులు కూలిపోయాయి. పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. దుర్వాసన వెదజల్లుతోంది. మిగిలిన నాలుగు మూత్రశాలల్లో అసలు సింక్‌లు లేవు. నీరు పడకుండా పైపులకు మద్యం సీసాలు అడ్డుగా పెట్టారు. వీటికి మరమ్మతులు చేయాలి.



అరైవల్ బ్లాక్‌కు ఎదురుగా అధ్వానంగా ఉచిత మూత్రశాల

మరమ్మతులు చేయిస్తే..



కుర్చీలు పడేశారు

లక్షలాది మంది ప్రయాణికులు కూర్చోవడానికి ప్రాంగణంలో కుర్చీలు ఏర్పాటు చేశారు. ఎయిర్ పోర్ట్ తరహాలో ఉండాలనే ఉద్దేశంతో.. అప్పట్లో ఒక్కోటి సుమారు రూ.5వేలు విలువైన కుర్చీలను తెప్పించారు. కొన్నాళ్లు వినియోగించారు. చిన్న చిన్న సమస్యలు రావడంతో.. వాటిని పక్కన పడేశారు. వీటికి మరమ్మతులు చేయిస్తే.. వాడుకోవచ్చు. అవసరాలు తీరతాయి.

ప్రీపెయిడ్ బూత్ ఖాళీ



సుదూరప్రాంతాల నుంచి నగరానికి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రీపెడ్ బూత్ ఏర్పాటు చేశారు. ఆటోకు నిర్ణీత రుసుం చెల్లించి గమ్యస్థానాలకు వెళ్లవచ్చు. దీనికోసం ప్రత్యేక సిబ్బందిని నియమించారు. వారి వద్ద టోకెన్లు తీసుకుని, సేవలను సద్వినియోగం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ ప్రీపెడ్ బూత్ పనిచేయడం లేదు. ఖాళీగా దర్శనమిస్తోంది.

దుర్గగుడి హుండీ ఆదాయం రూ. 2.05 కోట్లు



పర్యవేక్షిస్తున్న డిప్యూటీ ఈవో రత్నరాజు

ఇంద్రకీలాద్రి: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మల్లికార్జున మహా మండపం ఆరో అంతస్తులో సోమవారం లెక్కించారు. 18 రోజుల్లో వచ్చిన కానుకలను లెక్కించగా రూ.2,05,75,873 ఆదాయం వచ్చింది. భక్తులు ఇవే కాకుండా 266 గ్రాముల బంగారం, 5.562 కిలోల వెండి వస్తువులను మొక్కుల రూపంలో చెల్లించారు. వీటితో పాటు 568 యూఎస్ఏ డాలర్లు, 185 యూఏఈ దీర్హామ్స్, 2500 నైజీరియా నైరాలు, 20 ఇంగ్లాండ్ పౌండ్స్, 40 కెనడా డాలర్లు వచ్చినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. కానుకల లెక్కింపును డిప్యూటీ ఈవో రత్నరాజు పర్యవేక్షించారు. దుర్గమ్మను నేరుగా దర్శించుకోలేని భక్తులు ఆన్‌లైన్లో ఈ- హుండీ ద్వారా రూ.75,396 సమర్పించారు.

జయప్రకాశ్‌కు ప్రజల్లో శాశ్వత స్థానం



నివాళులర్పిస్తున్న వెంకయ్యనాయుడు, లక్ష్మీప్రసాద్, శ్రీతిరుమలేష్, శ్రీనివాస్

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ప్రజాప్రతినిధిగా, రాజకీయ విశ్లేషకుడిగా అడుసుమిల్లి జయప్రకాశ్ ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచిపోతారని మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. మాజీ ఎమ్మెల్యే అడుసుమిల్లి జయప్రకాశ్ సంస్మరణ సభని ఎంజీ రోడ్డులోని శేషసాయి కల్యాణ వేదికలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ... విజయవాడ ప్రత్యక్ష రాజకీయాల్లో జయప్రకాశ్ ప్రముఖ పాత్ర పోషించారని గుర్తు చేశారు. నమ్మిన సిద్ధాంతం కోసం వెనకడుగు వేయకుండా పోరాటం చేశారని పేర్కొన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ.. ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకున్నా.. పరోక్ష రాజకీయాల్లో జయప్రకాశ్ క్రియాశీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ... తాము స్నేహపూర్వకంగా ఉండేవాళ్లమని గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, మండలి బుద్ధప్రసాద్, కామినేని శ్రీనివాస్, వెనిగళ్ల రాము, మాజీ ఎంపీలు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, కేవీపీ రామచంద్రరావు, వడ్డే శోభనాద్రీశ్వరరావు, లగడపాటి రాజగోపాల్, మాజీ ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, జయప్రకాశ్ కుమారుడు అడుసుమిల్లి శ్రీతిరుమలేష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అర్హులందరినీ ఓటరుగా నమోదు చేయాలి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈసీ మార్గదర్శకాల ప్రకారం అర్హులందరినీ ఓటరుగా నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉమ్మడి కృష్ణా, గుంటూరు డీఆర్వోలు, ఆర్డీవోలు, తహసీల్దార్లతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పదవీకాలం 2025, మార్చి 29తో ముగుస్తుందని, ఈ నేపథ్యంలో ఎన్నికలకు ఓటరు జాబితా రూపకల్పనకు నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఓటరుగా నమోదుకు నవంబరు 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని, డిసెంబర్ 9 వరకు అభ్యంతరాల స్వీకరించి, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తారన్నారు. గతంలో ఓటరు జాబితాను ప్రస్తుతం పరిగణనలోకి తీసుకోరని, అందువల్ల ప్రతి ఒక్కరూ నూతనంగా ఓటుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అర్హతలివీ.. 2021 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు ఓటరుగా నమోదుకు అర్హులని, సాధారణ డిగ్రీతో పాటు ఇంటర్ తర్వాత డిప్లొమా చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో సాధారణ నివాసై దేశంలో ఎక్కడైనా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు ఫారం 18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్లలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలుందన్నారు. వచ్చిన దరఖాస్తులను ఏఈఆర్వోలు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి అందించాలన్నారు. ఫారం-18 దరఖాస్తులు 1.50 లక్షలు ముద్రించామని, వీటని ఏఈఆర్వోలకు అందించామన్నారు. ఒకే కుటుంబానికి సంబంధించినవి, ఒకే సంస్థలో పనిచేసే వారికి సంబంధించిన దరఖాస్తులు మాత్రమే ఒకేసారి తీసుకునేందుకు అనుమతించాలన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2.50 లక్షల మంది ఓటర్లుగా నమోదయ్యారని, ప్రస్తుతం 3.50 లక్షల మందిని నమోదు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. వీసీలో డీఆర్వో పి.రోజా, కలెక్టరేట్ ఎన్నికల విభాగ పర్యవేక్షకుడు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీకి ధర్నా

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : కానిస్టేబుళ్ల భర్తీ ప్రక్రియ పూర్తి చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న డిమాండ్ చేశారు. ఈ విషయమై డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నాచౌక్‌లో మోకాళ్లపై కూర్చొని వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండేళ్ల కిందట 6 వేల కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారని చెప్పారు. ప్రాథమిక రాత పరీక్షలో 95,208 మంది అభ్యర్థులు అర్హత సాధించారని తెలిపారు. దేహదారుఢ్య, మెయిన్స్ పరీక్షలు ఇప్పటి వరకు నిర్వహించలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం హోంగార్డు రిజర్వేషన్లు సివిల్ నుంచి 8 నుంచి 15శాతం, ఏపీఎస్పీ 15 నుంచి 24శాతానికి పెంచడం వల్ల నిరుద్యోగులకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. భవిష్యత్తులో యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా చేసేందుకే ఇలా చేశారని మండిపడ్డారు. దీనిపై హోంగార్డులు హైకోర్టును ఆశ్రయించగా.. వారికి అనుకూలంగా తీర్పు వచ్చిందని చెప్పారు. సుప్రీం కోర్టులో అప్పీలు చేయగా.. గత ప్రభుత్వం పట్టించుకోలేదని, అభ్యర్థులు పూర్తిగా నష్టపోయారని వివరించారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని అభ్యర్థులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని నాయకులు.. తెదేపా కేంద్ర కార్యాలయంలోని మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు నాగేశ్వరరావు, కృష్ణ, నాగార్జున, కిరణ్, శ్రీను నాయక్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.



డీవైఎఫ్ఐ నాయకులు, అభ్యర్థుల నిరసన

ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే : వివిధ ప్రభుత్వ శాఖలు, పరిశ్రమల్లో పని చేస్తున్న ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ధర్నా చౌక్‌లో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల్లో పని చేసే ఒప్పంద కార్మికులకు కనీస వేతనాలు, పని గంటలు, సెలవులు, ఇతర సౌకర్యాలు అమలు కావడం లేదని ఆరోపించారు. సంబంధిత గుత్తేదారులు వారిని దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో విద్యుత్తు, ఆర్టీసీతో సహా ఔట్‌సోర్సింగ్ విధానంలో లక్షలాది మంది పని చేస్తున్నారని తెలిపారు. ఈ రంగాలను రెగ్యులరైజ్ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పరిశ్రమల్లో తనిఖీలు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.ఆర్.కె.మూర్తి, కె.ఉమామహేశ్వరరావు, ఆర్.వి.నరసింహారావు, ఎ.వెంకటేశ్వరరావు, ఎ.కమల, ఎం.మహేష్, సి.హెచ్.సుధాకర్, ఇ.వి.నారాయణ, కె.దుర్గారావు, ఎం.సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకులు

కృష్ణా జిల్లా విద్యుత్తు సర్కిల్ ఎస్ఈగా సత్యానందం



సత్యానందంను అభినందిస్తున్న దీపక్

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : కృష్ణా జిల్లా విద్యుత్తు సర్కిల్ తొలి ఎస్ఈగా ఎం.సత్యానందను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు విజయవాడ సర్కిల్ పేరుతో ఉమ్మడి కృష్ణా జిల్లాకు ఎ.మురళీమోహన్ ఎస్ఈగా ఉన్నారు. ఇటీవల జరిగిన మార్పుల్లో భాగంగా విజయవాడ సర్కిల్‌ను కృష్ణా జిల్లా, ఎన్టీఆర్ జిల్లాలుగా విభజించారు. ఎన్టీఆర్ జిల్లాకు ఎ.మురళీమోహన్‌ను ఎస్ఈగా యథాస్థానంలో ఉంచారు. కొత్తగా ఏర్పడిన కృష్ణాజిల్లా సర్కిల్‌కు ఎస్ఈగా స్కాడా జీఎంగా పనిచేస్తున్న ఎం.సత్యానందం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం సాయంత్రం విజయవాడలోని సీఎండీ కార్యాలయంలో సత్యానందం సదరు ఉత్తర్వులు అందుకున్నారు. సీనియర్ అసిస్టెంట్ గుడేటి దీపక్.. ఆయన్ని అభినందించారు.